హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.174	260	290
నల్లగొండ	రూ.162	235	267

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 । కనిష్ఠం 24.4

ఆనందం



నెరవేరిన మినీ అంగన్‌వాడీల కల

- అంగన్‌వాడీ టీచర్‌గా అప్‌గ్రేడ్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 402 మందికి ప్రయోజనం

భువనగిరి టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): మినీ అంగన్‌వాడీ టీచర్ల దశాబ్దాల కల నెరవేరింది. అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తిస్తూ సమాన వేతనం ఇవ్వాలని చేసిన పోరాటాలు ఫలించాయి. మినీ అంగన్‌వాడీలను అంగన్‌వాడీ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 402 మంది అంగన్‌వాడీ టీచర్లుగా అప్‌గ్రేడ్ అయ్యారు. అలాగే వారి వేతనం రూ.7,800 నుంచి రూ.13,650కి పెరగనుంది. త్వరలో ఆయా కేంద్రాల్లో ఆయాల ను నియమించే అవకాశాలు కూడా ఉన్నాయి. దీంతో అర్హులైన స్థానిక మహిళలకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై అప్‌గ్రేడ్ పొందిన అంగన్‌వాడీ టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఖాళీ పోస్టులను కూడా భర్తీ చేస్తామని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి జిల్లాలో అప్‌గ్రేడ్ అయిన మినీ అంగన్‌వాడీ కేంద్రాలతో కలిపి మొత్తం వీటి సంఖ్య 4,203కు చేరింది. వీటిలో 192 టీచర్ల పోస్టులు, 800 ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే 402 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయి అంగన్‌వాడీ కేంద్రాలుగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయడంతో వాటిలో నూతనంగా ఏర్పడే ఆయాల పోస్టులను కూడా భర్తీ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం 20మంది పిల్లలకు పైబడి ఉంటేనే ఆయా పోస్టు మంజూరవుతుంది. దీంతో అప్‌గ్రేడ్ అయిన అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా ఆయా పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తే ప్రస్తుత 800 ఆయా పోస్టుల ఖాళీల సంఖ్య గణనీయంగా పెరగనుంది. అదే సమయంలో అప్‌గ్రేడ్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను తేల్చడం లేదా నిబంధనలను సవరిస్తూ సంఖ్యతో నిమిత్తం లేకుండా ఆయా పోస్టులను మంజూరు చేసి భర్తీ చేసే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

జిల్లా	కేంద్రాలు	అప్‌గ్రేడెడ్ మినీ అంగన్‌వాడీలు	టీచర్ల ఖాళీలు	ఆయాల ఖాళీలు
నల్లగొండ	2,093	262	57	263
సూర్యాపేట	1,209	83	78	274
యాదాద్రి	901	57	57	263
మొత్తం	4,203	402	192	800

ఆగ్రహం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నేతలు (ఫైల్‌ఫొటో)

సర్వే పైసలు ఎప్పుడిస్తాయ్?

- జిల్లాలో 9వేల మందికి పైగా ఎదురుచూపు
- దశల వారీగా ఆందోళనకు సిద్ధమవుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు రెమ్యునరేషన్ చెల్లించక పోవడంతో ఆందోళనబాట పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నవంబరు 6 నుంచి 18వ తేదీ వరకు సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించింది. ఈ సర్వేలో ఉద్యోగులతో పాటు ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో సుమారు 9వేల మంది సర్వేలో పాల్గొనగా, నేటికీ రెమ్యునరేషన్ విడుదలచేయలేదు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయులు రెమ్యునరేషన్ కోసం ఎదురుచూసి ఈ ఏడాది మార్చి 18న నిరసన తెలిపారు. తిరిగి ఈ నెల 5న కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన సర్వేను కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకొని దేశవ్యాప్తంగా కులగణనకు ఆమోదం తెలిపింది. అయితే దేశానికే ఆదర్శంగా నిలిచిన కుటుంబ సర్వేను నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు, సిబ్బందికి ఇప్పటి వరకు రెమ్యునరేషన్ చెల్లించకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. సుమారు ఆరు నెలలు దాటినా చెల్లింపుల విషయంలో ప్రభుత్వం తాత్సరం చేస్తుండటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సర్వే నిర్వహించిన సూర్యాపేట, యాదాద్రి జిల్లాల సిబ్బందికి రెమ్యునరేషన్‌ను చెల్లింపులు పూర్తయ్యాయి. చిన్న జిల్లాల్లో చెల్లింపులను పూర్తి చేసిన ప్రభుత్వం రాష్ట్రంలోనే అధిక మండలాలు ఉన్న నల్లగొండ జిల్లాలో మాత్రం నేటికీ వాటిని చెల్లించలేదు. పెద్ద జిల్లా కావడంతో రెమ్యునరేషన్ అధికంగా ఉండటంతోనే ఆలస్యం చేస్తున్నారన్న చర్చ నడుస్తోంది.

శ్రమకోర్చి విధులు నిర్వహించినా

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులతో పాటు ఉద్యోగులకు సర్వే బాధ్యతలు అప్పగించింది. వారు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. తొలుత ప్రతీ ఇంటికి స్టిక్కరింగ్ చేసి ఆ తరువాత ప్రభుత్వం ఇచ్చిన నిర్దేశిత ఫాంలో వివరాలను నింపారు. సర్వేలో పలు ప్రశ్నలతో కూడి ఉండటంతో ఒక్కో కుటుంబ సర్వేకు గంటన్నరకు పైగా సమయం పట్టిన సందర్భాలు ఉన్నాయి. కొన్నిసార్లు ఆయా కుటుంబ సభ్యులు లేకపోతే తిరిగి ఆ ఇంటికి వెళ్లి మరోసారి వివరాలు నమోదు చేశారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులానికి సంబంధించిన వివరాలను ఎన్యూమరేటర్లు నమోదు చేశారు. సర్వే కోసం శ్రమకోర్చి విధులు నిర్వహించామని, అయినా ప్రభుత్వం చెల్లింపులు చేయకపోవడమేంటని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. ఇతర జిల్లాలలో సర్వే నిర్వహించిన సిబ్బందికి చెల్లింపులు చేసి జిల్లాలో మాత్రం నిలిపివేయడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మహిళా ఉపాధ్యాయినులు ఈ సర్వేలో ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రమకోర్చి సర్వే నిర్వహించినా చెల్లింపులు చేయకపోడంతో ఉపాధ్యాయినులు అసంతృప్తిగా ఉన్నారు. అయితే బిల్లులు చేసి ప్రభుత్వానికి జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. అయినా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో రెమ్యూనరేషన్ ఎప్పుడువస్తుందో,అసలు వస్తుందో రాదోననే సందేహాన్ని ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు.

ఎన్యూమరేటర్‌కు రూ.10వేలు, సూపర్‌వైజర్‌కు రూ.12వేలు...

సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లకు రూ.10వేలు, సూపర్‌వైజర్లకు రూ.12వేల చొప్పున చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించి అందుకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో సుమారు 9వేలకు మందికి పైగా ఈ రెమ్యూనరేషన్‌ను చెల్లించాల్సి ఉంది. సర్వే పూర్తి చేసిన అనంతరం కొద్ది రోజుల్లోనే ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉన్నా, ప్రభుత్వం ఆ వైపుగా చర్యలు తీసుకోలేదు. దీంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇప్పటికే రెండు దఫాలుగా ఆందోళనలు నిర్వహించారు. వారం రోజుల్లో రెమ్యూనరేషన్ చెల్లించకపోతే ప్రత్యేక కార్యాచరణకు దిగుతామని ఇప్పటికే టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ హెచ్చరించింది. వారం రోజుల తరువాత దశల వారీగా ఆందోళన కార్యక్రమాలతో పాటు ప్రత్యక్ష కార్యచరణ కూడా చేపడతామని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. కావాలనే ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ రెమ్యూనరేషన్ ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. చేసిన..

- మిగతా 8వ పేజీలో...

ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



కొప్పోలు ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

గుర్రంపోడు, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం మండలంలోని గుర్రంపోడు, కొప్పోలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడుతూ, యాసంగి సీజన్‌లో జిల్లాలో ఇప్పటివరకు 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచామన్నారు. వర్షం వచ్చినప్పటికీ రైతులు ఎలాంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, వారం రోజుల్లో జిల్లాలో ధాన్యం కొనుగోలును పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మండలంలో లారీల కొరత ఉందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, లారీల సమస్య తలెత్తకుండా ఒకే మిల్లుకు నాలుగైదు పంపించకుండా ఆ పరిధిలో ఉన్న మిల్లులన్నింటికీ లారీలను పంపించాలని నిర్వాహకులకు సూచించారు. కేటాయించిన లారీలు సరిపోకపోతే అదనంగా స్థానికంగా లారీలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి దళారులు ధాన్యాన్ని తీసుకువస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మిల్లరు ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, పౌరసరఫరాలశాఖ డీఎం హరీష్, డీసీవో ఉన్నారు.

ఫాంపాండ్లు నిర్మించుకోవాలని

(ఆంధ్రజ్యోతి, నిడమనూరు): రైతులు ఫాంపాండ్లు నిర్మించుకోవాలని, తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రబెల్లి శివారులోని లోలెవెల్ కెనాల్(ఎల్ఎల్‌సీ)ను ఆమె పరిశీలించారు. గ్రామ శివారులో ఉన్న శనగకుంట చెరువును నింపడంతో పాటు ఎల్ఎల్‌సీ కెనాల్‌తో శాశ్వత లిఫ్టును ఏర్పాటు చేయాలని, ముత్యాలమ్మ కుంట ఆక్రమణలు అడ్డుకోవాలని గ్రామస్థులు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో వారి ప్రతిపాదనల మేరకు కలెక్టర్ ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, రెవెన్యూ, ఐబీ అధికారులతో కలిసి చెరువును, కెనాల్‌ను పరిశీలించారు.

గతంలో యూటీ ద్వారా మోటార్ల సాయంతో శనగకుంట చెరువుకు నీటిని సరఫరా చేశారని, మోటార్లు మరమ్మతులకు గురవడంతో వర్షం నీరే దిక్కైందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. చెరువు పరిధిలో ఆయకట్టు, శాశ్వత లిఫ్టు ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ఐబీ డీఈ శివరాత్రి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. 41 ఎకరాల ఆయకట్టు మాత్రమే ఉందని, లిఫ్టు సాధ్యం కాదని ఆయన వివరించారు. దీంతో ఫాంపాండ్లు నిర్మించుకోవాలని రైతులకు ఆమె సూచించారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బోనగిరి రమేష్‌ను ఆదేశించారు. అనంతరం చెరువు శిఖం భూముల ఆక్రమణలపై స్పందించి సర్వే చేసి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జంగాల కృష్ణయ్యను ఆదేశించారు. ఆమె వెంట ఐబీ ఏఈ ప్రవీణ్‌రాజ్, ఆర్ఐ సందీప్, సర్వేయర్ విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

అకాల వర్షాలతో...

నిమ్మ ధర ఢమాల్

- ఏప్రిల్‌లో కిలో రూ.80, ప్రస్తుతం రూ.30
- పేట జిల్లాలో 3వేల ఎకరాల్లో నిమ్మ సాగు

ఆవేదన



పంట చేతికి వచ్చినప్పుడు గిట్టుబాటు ధర లేక, పెట్టిన పెట్టుబడికి సరైన రాబడి రాక నిమ్మ రైతులు ఆందోళన చెందుతున్నారు. సూర్యాపేట జిల్లాలో 3వేల ఎకరాల్లో రైతులు నిమ్మ సాగు చేశా రు. ఎకరాకు రూ.1.20లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. పంట దిగుబడి బాగుందని, ఈ ఏడాదైనా మంచి ఆదాయం వస్తుందని భావించిన రైతుల ఆశలపై ఆకాల వర్షం నీళ్లు చల్లింది. మార్చి నెలలో కిలో నిమ్మకాయల ధర రూ.30 ఉండగా, ఏప్రిల్‌లో రూ.80కి పెరిగింది. అయితే అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా కాయలు నేలరాలాయి. ఇదే అదునుగా దళారులు ధరను రూ.30కి తగ్గించారు. సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో దళారులు ఇచ్చిన ధరకు కాయలను విక్రయించి రైతులు నష్టపోతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, కోదాడ)

• 6లో..

వేసవిలో నేర్చుకుందాం

- సెలవుల్లో విద్యార్థుల నైపుణ్యమే లక్ష్యంగా శిబిరాలు
- క్రీడలు, డ్యాన్స్, డ్రాయింగ్, వాయిద్యం, ధ్యానం, సంగీతంలో శిక్షణ
- పాఠశాల విద్యాశాఖ అధ్వర్యంలో రైజింగ్ యంగ్ ఇండియా కార్యక్రమం
- ఉమ్మడి జిల్లాలో పలు పాఠశాలలు ఎంపిక
- సూర్యాపేట జిల్లాలో 50 పాఠశాలల్లో కార్యక్రమాలు

• 7లో..

ఆహ్లాదం



వేసవి సెలవులు వృథా కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. విద్యార్థుల్లో దాగిన నైపుణ్యాలను వెలికితీసి ఆయా అంశాల్లో మరింత సానపట్టేందుకు వేసవి శిబిరాలను ప్రారంభించింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేసవి శిక్షణా శిబిరాలు కొనసాగుతున్నాయి. అదేవిధంగా పాఠశాల విద్యాశాఖ రైజింగ్ యంగ్ ఇండియా పేరిట శిబిరాలు నిర్వహిస్తోంది. క్రీడలు, డ్యాన్స్, డ్రాయింగ్, వాయిద్యం, ధ్యానంతోపాటు పలు విభాగాల్లో శిక్షణ ఇస్తోంది. అందుకు సూర్యాపేట జిల్లాలో 50 పాఠశాలలను ఎంపికచేసి కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

నామినేటెడ్ పోస్టులు 50శాతం కేటాయించాలి

మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేలా సృజన



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు సృజన

దేవరకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం మహిళలకు కేటాయించాలని, దీంతో దేశాభివృద్ధిలో మహిళ భాగస్వామ్యం సాధ్యపడుతుందని జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేలా సృజన అన్నారు. మంగళవారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన ప్రాంతీయ మహిళా సమా ఖ్య నియోజకవర్గ జనరల్‌బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైందన్నారు. మహిళాశక్తి గురించి, ఆహార నియంత్రణ గురించి మాట్లాడుతూనే వ్యవస్థీకృత హింసకు పాల్పడుతోందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి పెనుభారం మోపుతోందన్నారు. పారిశుధ్య కార్మికులు మొదలు ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, వైద్యులను సైతం కాంట్రాక్ట్ పద్ధతిలో నియమిస్తున్నారని, దీంతో శ్రమశక్తిని దోచుకుంటున్నారని ఆరోపించారు. శాశ్వత ఉద్యోగాల్లో మహిళా భాగస్వామ్యాన్ని తగ్గిస్తున్నారని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకంలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంలేదని ఆరోపించారు. అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారం, ప్రతీ మహిళకు రూ.2,500 ఇస్తామన్న హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెదునూరి జ్యోతి, జిల్లా అధ్యక్షురాలు లింగంపల్లి అనిత, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ, మంజుల, జ్యోతి, సంగీత, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహిళా సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నల్లగొండ ఇంజనీర్స్ క్రికెట్ లీగ్ పోటీలు



క్రికెట్ జట్లతో నల్లగొండ ఆంజనేయులు తదితరులు

హాలియా, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఏఈఈ అసోసియేషన్, హైదరాబాద్ ఇంజనీరింగ్ అసోసియేషన్ అధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నీటి పారుదల ఇంజనీర్స్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ క్రికెట్ లీగ్ పోటీలను నల్లగొండలో అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ నల్లగొండ ఆంజనేయులు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు క్రాంతికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉద్యోగుల మానసిక ఉల్లాసం కోసం అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పోటీల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ శివరాత్రి శ్రీను ప్రభాకర్, నాగరాజు, సంతోష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మహేష్, జనరల్ సెక్రటరీ చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండాను మించిన జెండా, ఎజెండా లేదు

సీపీఎం నేత జూలకంటి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి

వేములపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచం లో ఎర్రజెండాను మించిన జెండా, ఎజెండా లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూ లకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మం డలంలోని మొల్కపట్నం గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకుడు మాలి జనార్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మాలి పురుషోత్తంరెడ్డి వర్ధంతి సభల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మా ట్లాడారు. మాలి జనార్ధన్‌రెడ్డి ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాడిన వ్యక్తి అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ వృత్తికి రాజీనా మా చేసి ప్రజల కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. మాలి పురుషోత్తంరెడ్డి సైతం ప్రజల పక్షాన, రైతుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడిన మహా నాయకుడన్నారు. ఇరువురు సమసమాజం, పేద ప్రజల స్వేచ్ఛ కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. ప్రస్తుత సమాజంలో ఎర్రజెండాపై చిన్న చూపు చూస్తున్నారని అది వారి అమాయకత్వం అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎర్రజెండా పాలన నడుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజలను మభ్యపెడుతూ పాలన సాగిస్తోందని ఆరోపించారు. దేశంలో సామాన్యుడు జీవనం సాగించే పరిస్థితి లేదని, దేశ సంపదను దోచి కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని, ప్రజలు ఆర్థిక ఊబిలోకి నెట్టివేయబడ్డారన్నారు. రాష్ట్రం, దేశం సుఖసంతోషంగా ఉండాలంటే కమ్యూనిస్టు పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు పాదూరి శశిధర్‌రెడ్డి, రవినాయక్, రెమడాల పరుశురాములు, చౌగాని సీతారాములు, మల్లు గౌతంరెడ్డి, పాదూరి గోవర్ధని, ప్రణీత్‌రెడ్డి, క్రాంతి, సైదులు, ఎల్లయ్య, లింగయ్య, పాల్గొన్నారు.

ఉపాధిహామీ చట్టం పరిరక్షణకు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య

చిట్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ చట్టం పరిరక్షణకు కూలీలు, సిబ్బంది ఐక్యంగా ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య పిలుపునిచ్చారు. మంగళవారం చిట్యాలలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీని పట్టణ ప్రాంతాలకు విస్తరించి, కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడుభూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14రకాల సరుకులు పంపిణీ చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిన చట్టాలను దొడ్డిదారిన అమలు చేస్తేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. రైతుల పొలాల్లో మోటార్లకు మీటర్లు బిగించి చార్జీలు వసూలు చేయడానికి రంగం సిద్ధం చేసిందన్నారు. ఉపాధిహామీ చట్ట పరిరక్షణకు ఈ నెల20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, ఉపాధ్యక్షుడు కత్తుల లింగస్వామి, మండల అధ్యక్షుడు కల్లూరు కుమారస్వామి, గుడిసె లక్ష్మీనారాయణ, కొండేటి రాములు, అర్రూరి నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో అపార నష్టం

• 7లో..

నిమ్మ ధరలు ఢమాల్

వేసవి వచ్చిందంటే నిమ్మకాయలకు మంచి డిమాండ్ ఉంటుంది. సాధారణ రోజుల కంటే ధర ఎక్కువగా పలుకుతుంది. అయితే అకాల వర్షాలతో డిమాండ్ తగ్గి ధర నేల చూపులు చూస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సూర్యాపేట జిల్లాలో మూడు వేల ఎకరాల్లో రైతులు నిమ్మ సాగు చేశారు. ఎకరాకు సాగు కోసం రూ.1.20 లక్షలు ఖర్చు చేశారు. పంట దిగుబడి బాగుందని, ఈ ఏడాది మంచి ఆదాయం వస్తుందని భావించిన రైతులకు అకాల వర్షం నిరాశ మిగిల్చింది. ఏప్రిల్ కిలో రూ.80 ఉన్న ధర ప్రస్తుతం రూ.30కి పడిపోయింది.

(ఆంధ్రజ్యోతి-కోదాడ)



ఏప్రిల్‌లో కిలో రూ.80, ప్రస్తుతం రూ.30

పంట చేతికందే దశలో ధర పలుకుతుండటంతో నిమ్మ సాగు చేసిన రైతులు లాభాలు ఆశించారు. మార్చి నెలలో అంతంత మాత్రం ఉన్న ధర, ఏప్రిల్‌లో పెరిగింది. మంచి ఆదాయం వస్తుందని ఆశించిన రైతులను వరుసగా కురుస్తున్న అకాల వర్షాలు వారి ఆశలపై నీళ్లు చల్లాయి. వర్షాల పేరుతో దళారులు ధర తగ్గించటంతో రైతులు దిగాలు పడుతున్నారు. పెరిగిన పెట్టుబడులు, రవాణా ఖర్చులు, వ్యాపారుల కమిషన్లను ఎదుర్కొనేలా దిగుబడి వచ్చే సమయంలో మద్దతు ధర ఉంటుందని భావించగా ధర లేక రైతులు తల పట్టుకున్నారు. పెట్టుబడికి తగ్గ ఆదాయం రాక ఆందోళన చెందుతున్నారు. మార్చిలో కిలో ధర రూ.30 ఉండగా, ఏప్రిల్‌లో రూ.80కి పెరిగింది. ఈ నెల మొదటివారం వచ్చేటప్పటికీ ధర రూ.30 తగ్గిందని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడులకు, సరైన ఫలితం లేక ఇబ్బందులు పడుతున్నామని బావురుమంటున్నారు. ప్రభుత్వం ఎప్పుడూ కిలోకి ధర రూ.45 ఉండేలా చర్యలు తీసుకుంటే రైతులు నష్టపోకుండా ఉంటారని పేర్కొంటున్నారు. అదేవిధంగా వరికి బోనస్ ఇచ్చిన మాదిరే, నిమ్మసాగు చేసే రైతులను గుర్తించి, వారికి తక్కువ ధరకు దుక్కి, పురుగు మందులు అందిస్తే నిమ్మ సాగు వైపు రైతులు మొగ్గుచూపుతారని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సరైన ధర లేకపోవటంతో నష్టాలు భరించలేక రైతులు ఏటేటా నిమ్మ సాగును తగ్గిస్తూ, ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు చూపుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఎకరాకు రూ.1.20 లక్షలు ఖర్చు చేస్తే, ఆదాయం రూ.1,44,000 వస్తుందని, ఖర్చులు పోను ఎకరాకు రూ.24 వేలు వస్తుందంటున్నారు. మూడు ఎకరాలు సాగు చేస్తే ఏడాదికి వచ్చే రాబడి రూ.72 వేలు అని, దీంతో పెరుగుతున్న ధరలతో ఇల్లు గడపటం కష్టమవుతుందంటున్నారు.

పెరుగుతున్న ఖర్చులు, పిల్లల చదువులకు డబ్బుల్లేక ముందుకు సాగడంలేదని వాపోతున్నారు. రైతులు నిమ్మ సాగు వైపునకు మళ్లాలంటే మార్కెట్‌తో పనిలేకుండా ప్రభుత్వమే నేరుగా కిలో రూ.45 చొప్పున కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

సూర్యాపేట జిల్లాలో మూడు వేల ఎకరాల్లో సాగు

సూర్యాపేట జిల్లాలో మూడు వేల ఎకరాల్లో నిమ్మ సాగు చేసినట్లు ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. ఎకరాకు 80 నిమ్మ మొక్కలు వేస్తారు. నాలుగు సంవత్సరాల నుంచి కాపు మొదలవుతుంది. అక్కడ నుంచి వానాకాలంలో ఎండుపుల్ల తీయటానికి ఒక్కో చెట్టుకు రూ.60, పాదులు తీసేందుకు రూ.80, పైమందులకు రూ.415, సేంద్రీయ ఎరువు, దుక్కి మందుకు రూ.330, కూలీల రవాణాకు రూ.200, కమీషన్‌దారుడికి రూ.100కి రూ.15,కూలీకి రూ.200, నిమ్మకాయల టిక్కీ రవాణాకు రూ.200 మొత్తంగా ఒక నిమ్మచెట్టుకు ఏడాదిలో రూ.1,471 ఖర్చు వస్తుందని రైతులు తెలిపారు. ఆ చొప్పున 80 మొక్కలకు(ఎకరాల్లో) రూ.1.20 ఖర్చు వస్తుంది. ఒక చెట్టు వానాకాలంలో 50 కిలోలు, వేసవిలో 50 కిలోలు టిక్కీ(సిమెంట్ బస్తా) ఇస్తుంది. కాగా వానాకాలంలో కిలో నిమ్మకాయలు రూ.6 ఉండగా, మార్చిలో కిలో రూ.30కి పెరిగింది. ఎకరాకు వానాకాలంలో ఒక చెట్టుకు(6 సంవత్సరాలు) 50 కిలోల టిక్కీ(సిమెంట్‌బస్తా) రాక, కిలో రూ.6 చొప్పున రూ.300 ఆదాయం వస్తుంది. మార్చి నెలకు ఒక టిక్కీకి(50కేజీలు) కిలో రూ.30 చొప్పున రూ.1500, వానాకాలం క్వింటా, మార్చిలో వచ్చే క్వింటా కలిపి రూ.1800 ఆదాయం వస్తుంది. ఆ చొప్పున ఎకరంలో 80 చెట్లకు రూ.1.44 లక్షల ఆదాయం వస్తుంది. ఇందులో ఖర్చు రూ.1.20 లక్షలు పోను మిగిలేది రూ.24 వేలు మాత్రమే అని రైతులు అంటున్నారు. సీజన్‌తో సంబంధం లేకుండా ప్రభుత్వం కిలో నిమ్మకాలను రూ.45కు కొనుగోలు చేస్తే లాభంతో పాటు రైతులకు ఇబ్బంది ఉండదంటున్నారు. ప్రతి ఏడాది రేటు తక్కువగా ఉండటం, చేసిన ఖర్చుకు తగ్గట్టుగా ఆదాయం రాక, కొత్త వారికి సాగు చేయాలని ఆలోచన రావటం లేదంటున్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా మార్కెట్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

● చేతి ఖర్చులు కూడా రావడం లేదు



పదిహేను ఏళ్ల నుంచి నిమ్మతోట సాగు చేస్తున్నా. వేసవిలో రేటు వచ్చినట్లే ఉంటుంది. తీరా పంట చేతికి వచ్చే సమయానికి ధర పడిపోతుంది. ఫలితంగా భార్యాభర్తలం ఆరుగాలం చేసిన కష్టానికి, ఖర్చుకు ఆదాయానికి పొంతన లేకుండా ఉంటుంది. చివరకు చేతి ఖర్చులు కూడా మిగిలే పరిస్థితి లేదు. ఏప్రిల్‌లో కిలో రూ.80 ఉంటే, ప్రస్తుం రూ.30కి తగ్గింది. దిగుబడి వచ్చేనాటికి అకాలవర్షాల పేరుతో దళారులు ధరను సగానికి తగ్గించారు. దీంతో చేసేదేమీ లేక ఇచ్చిన ధర తీసుకొని సర్దుకోవాల్సి వస్తోంది. రైతు పరిస్థితి ఏడాదికేడాది దిగజారుతోంది. 15 ఏళ్ల కిందట 10 ఎకరాల్లో నిమ్మసాగు చేస్తే, నేడు మూడు ఎకరాల్లో సాగు చేస్తున్నా. బహిరంగ మార్కెట్‌లో ఒక నిమ్మకాయ వచ్చి రూ.15పైనే పలుకుతోంది. రైతుకు వచ్చేటప్పటికీ ఆ ధర ఉండదు. అన్నిరకాల ఖర్చులు ఏటేటా పెరుగుతున్నాయి. నిమ్మకాయల ధర మాత్రం పెరగటంలేదు. సూర్యాపేట జిల్లాలో 15 ఏళ్ల కిందట నిమ్మసాగు అధికంగా ఉండేది. ఖమ్మం డిపో వారు ప్రత్యేకంగా నడిగూడెం మండలానికి నిమ్మకాయలు తీసుకెళ్లేందుకు ఉదయం, సాయంత్రం బస్సు నడిపేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రతి ఏడాది 10 ఎకరాల్లో నిమ్మ చెట్లు తీసివేసి, ఇతర పంటలను వేస్తున్నారు. నిమ్మసాగుతో సరైన ఆదాయం ఉండటం లేదు. మంచి దుస్తులు వేసుకోలేకపోతున్నాం. పిల్లలను చదివించాలన్నా ఇబ్బంది పడుతున్నాం. పెట్టుబడికి రాబడి వచ్చేలా దళారులు లేకుండా, నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

పగడాల వెంకటనారాయణ, నిమ్మ రైతు

ఇద్దరు యువకులను బలిగొన్న రాంగ్‌రూట్



లోకేష్, నిఖిల్(ఫైల్‌ఫొటోలు)

శాలిగౌరారం, మే 6 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాదారం-చౌవుళ్ళ గూడెం గ్రామాల మధ్య రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు, బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు.మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కట్టంగూరు మండలం అయిటిపాముల ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన మాదగోని లోకేష్(24), అదే మండలం మల్లారం పంచాయతీ పరిధిలోని పెద్దోని బావి గ్రామానికి చెందిన రాచకొండ నిఖిల్(22) కలిసి బైకు మీద అర్వపల్లికి వెళ్తున్నారు. శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామానికి చెంది పోగుల విఠల్ కారులో ఉట్కూరు గ్రామానికి వస్తున్నాడు. చౌవుళ్ళగూడెం సమీపంలో రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు బైక్‌ను గట్టిగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న మాదగోని లోకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన రాచకొండ నిఖిల్‌ను కారులో ఉండి గాయపడిన విఠల్‌ను 108వాహనంలో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిఖిల్ పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కారు నడిపే వ్యక్తి విఠల్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.లోకేష్ ఐటీఐ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. రాచకొండ నిఖిల్ డిగ్రీ చదివి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. లోకేష్, నిఖిల్ గ్రామాలు పక్కపక్కనే కావడంతో ఇద్దరు కలిసిమెలసి తిరుగుతారని తెలిపారు. ఇద్దరి మృతితో వారి రెండు గ్రామాల్లో విషాదం నెలకొంది.

బావిలో పడి బాలుడి మృతి



చరణ్(ఫైల్‌ఫొటో)

వలిగొండ, మే 6 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలో వ్యవసాయ బావిలో పడి బాలుడు మృతి చెందాడు. ఎస్‌ఐ యుగేంధర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని (ఎం)తుర్కపల్లి గ్రామానికి చెందిన బట్టు సుధాకర్ మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు చరణ్(12) పుట్టుకతో చెవిటి, మూగవాడు. సోమవారం అతడి సోదరుడి కుమారుడు గౌతమ్‌తో కలిసి స్థానిక వ్యవసాయ బావిలో స్నానానికి వెళ్లారు. ఈత రాక పోవడంతో ఒడ్డున స్నానం చేస్తున్నారు. ప్రమాదవశాత్తు కాలు జారి చరణ్ బావిలో పడి మునిగిపోయాడు. అది చూసిన గౌతమ్ ఇంటికి వచ్చి భయంతో ఎవరికీ చెప్పలేదు. సాయంత్రం తర్వాత విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పాడు. గ్రామస్థులతో బావి వద్దకు వెళ్లి మోటార్ల సహాయంతో నీటిని తోడేయగా మృతదేహం బయటపడింది. చరణ్ తండ్రి సుధాకర్ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ



సైదయ్య(ఫైల్‌ఫొటో)

నిడమనూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం వల్లభాపురం శివారు కక్కయ్యగూడెంలో మంగళవారం విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కుంచం సైదయ్య(40)వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. తనకున్న గొర్రె పిల్లల కోసం ఇంటిపక్కన ఓ రేకుల షెడ్డు వేశాడు. సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలుల కారణంగా రేకులు ఎగిరిపోయాయి. మంగళవారం ఉదయం రేకులను సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు మిర్యాలగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే సైదయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. సైదయ్య మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. సైదయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సైదయ్య మృతిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు

వడదెబ్బతో ఉపాధిహామీ కూలీ



యాదయ్య(ఫైల్‌ఫొటో)

మునుగోడు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లాలో ఉపాధికూలీ మంగళవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మునుగోడు మండలం రావిగూడెం గ్రామానికి చెందిన గుర్రం యాదయ్య(51) రోజు మాదిరే గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులకు వెళ్లాడు. సోమవారం మధ్యాహ్నం పనిప్రదేశంలో అస్వస్థతకు గురై పడిపోయాడు. తోటి కూలీల సమాచారంతో కుటుంబ సభ్యులు యాదయ్యను చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రైవేటుఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం యాదయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు..

జీవనశైలిలో మార్పుల వల్లే ఆరోగ్య సమస్యలు



తిరుమలగిరి(సాగర్)లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య నిపుణులు డాక్టర్ ముప్పా రామారావు

తిరుమలగిరి(సాగర్), మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో జీవనశైలిలో వస్తున్న మార్పుల వల్లనే మానవాళికి పలు ఆరోగ్య సమస్యలు వచ్చి సవాలుగా మారాయని ప్రముఖ వైద్య నిపుణుడు, జ్యోతి ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ ముప్పా రామారావు అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు శాగం పెద్దిరెడ్డితో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. మారుమూల గ్రామాల్లోని ప్రజలకు ప్రధానంగా గుండె జీర్ణకోశ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యుడు ముప్పా శ్రీహర్ష, వెంకటేష్‌లతోపాటు పలువురు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన సుమారు 100 మందికి కార్డియాలజీ, ఎండోక్రైనాలజీలకు సంబంధించి విలువైన వైద్యపరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అదేవిధంగా రోగులకు మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి ఉచితంగా తమ ఆసుపత్రిలో అన్నిరకాల ఆపరేషన్లు, వైద్యం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు శాగం పెద్దిరెడ్డి, శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి, షేక్ సుబాని, పిట్టల కృష్ణ, శాగం లింగారెడ్డి, కటికం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ యూనివర్సిటీ భూసేకరణ ఉద్రిక్తం



పోలీసులు, రైతుల మధ్య తోపులాట, రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

హుజూర్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యూనివర్సిటీ నిర్మాణానికి 100 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించేందుకు అధికారులు యత్నించడం, స్థానికులు భూ సర్వేను అడ్డుకొని ఆందోళనలు, నిరసనలు నిర్వహించడంతో హుజూర్‌నగర్ పట్టణం మంగళవారం అట్టుడికింది. ఉగాది సందర్భంగా సన్న బియ్యం పంపిణీకి సీఎం రేవంత్‌రెడ్డి హుజూర్‌నగర్ పర్యటనకు రాగా, పట్టణానికి వ్యవసాయ యూనివర్సిటీని మంజూరు చేశారు. దీంతో యూనివర్సిటీ నిర్మాణానికి అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేస్తున్న నేపథ్యంలో కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతల సూచనల మేరకు ప్రభుత్వ భూసేకరణ వివాదాలకు కేంద్రంగా మారింది.

హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలోని 604సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూ సేకరణ ఉద్రిక్తంగా మారింది. మూడు రోజులుగా భూసేకరణకు అధికారులు యత్నిస్తుండగా, సర్వేయర్లను రైతులు మంగళవారం మూడోసారి అడ్డుకొని నిరసన తెలిపారు. రెవెన్యూ అధికారులు పెద్దసంఖ్యలో భూసేకరణకు రాగా,స్థానికుల అడ్డగింతతో ఒక్క అడుగు ముందుకు కదలలేదు. అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో 10మంది పోలీస్‌సిబ్బంది, 10మంది రెవెన్యూ సిబ్బంది రాగా, బాధిత రైతులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తరతరాలుగా సాగుచేసుకుంటున్న భూమిని గుంజుకుంటే సహించేది లేదని బాధిత కుటుంబాలు హెచ్చరించాయి.

తహసీల్దార్, పోలీసులు నచ్చజెప్పినా..

సర్వేను రైతులు అడ్డుకుంటున్నారని రెవెన్యూ అధికారులు సమాచారం ఇవ్వడంతో ఉదయం 11 గంటల సమయంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డి అక్కడికి చేరుకొని బాధిత రైతులను ఒప్పించేందుకు ప్రయత్నించారు. రైతులు ససేమిరా అనడంతో పోలీసులకు ఆయన సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ ముత్తయ్య, పోలీసు సిబ్బందితో తరలివచ్చి రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అప్పటికే రెండుసార్లు సర్వేచేసేందుకు అధికారులు ప్రయత్నించగా, తహసీల్దార్, ఎస్‌ఐ వచ్చాక మూడోసారి భూముల హద్దులు నిర్ణయించేందుకు సర్వేయర్ల బృందం యత్నించింది. దీంతో 1 గంట ప్రాంతంలో రైతులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సర్వే చేస్తున్న అధికారులను అడ్డుకునేందుకు రైతులు యత్నించగా పోలీసులు ప్రతిఘటించారు. దీంతో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. కొంతమంది పోలీసులు రైతులను బలవంతంగా నెట్టివేయడంతో వారు కిందపడ్డారు. ఈ ఘటనతో మనోవేదనకు గురైన బూరుగడ్డకు చెందిన రైతు గువ్వల గురవయ్య ఆత్మహత్యకు యత్నించాడు. ఘటనా ప్రాంతంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలను పట్టుకుని లాగాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు గురవయ్యను పక్కకు నెట్టివేయడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన జరుగుతున్న సమయంలో మహిళా రైతులు, పోలీసుల మధ్య పెనుగులాట జరిగింది. దీంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో సర్వేను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు తహసీల్దార్ నాగార్జునరెడ్డి ప్రకటించారు. తిరిగి వచ్చే సోమవారం సర్వే చేస్తామని, అప్పటి వరకు రైతుల వద్ద ఉన్న డిజిటల్ పాస్ పుస్తకాల జిరాక్స్‌లు, ఇతర ఆధారాలు ఉంటే తీసుకురావాలని, సర్వేకు సహకరించాలని తహసీల్దార్ కోరారు. దీంతో బాధిత రైతులు శాంతించి ఆందోళన విరమించారు.

మొత్తం 164 ఎకరాల భూమి

బూరుగడ్డ గ్రామంలో 604 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమి 164.10 ఎకరాల వరకు ఉంది. ఈ భూమిలో ప్రభుత్వం రెండు విడతల్లో సుమారు 60 ఎకరాలకు సంబంధించి పేదలకు పట్టాలు పంపిణీ చేసింది. ఇది పోగా, మరో 104 ఎకరాల మిగులు భూమి ఉంది. అక్కడ పట్టాలు పొందిన రైతులే మిగులు భూములను కూడా ఒక్కొక్కరు 10 గుంటల నుంచి నాలుగైదు ఎకరాల వరకు ఆక్రమించుకుని సాగుచేస్తున్నారు. తరాలుగా ఈ భూములను సాగు చేసుకుంటున్న రైతులు భూసేకరణను అడ్డుకుంటున్నారు. ప్రభుత్వం ఇటీవల మంజూరుచేసిన వ్యవసాయ యూనివర్సిటీని ఇక్కడ నిర్మించాలని బూరుగడ్డకు చెందిన అధికార పార్టీ నాయకులు ముగ్గురు ప్రభుత్వ ఉన్నతాధికారులను కోరడంతో, ఆ దిశగా అధికారులు సర్వే చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రం కావడంతో 100 ఎకరాల భూమి అనువైనదిగా అధికారులు గుర్తించారు. అయితే సర్వే ప్రారంభ దశలోనే భూ ఆక్రమణలో ఉన్న రైతులు తిరుగుబాటు చేశారు.

చావనైనా చస్తాం

దశాబ్దాలుగా ప్రభుత్వభూములను సాగుచేసుకుంటూ కుటుంబాలు వెళ్లదీసుకుంటున్నామని బాధిత రైతులు యరగాని నాగమణి, యరగాని కాశయ్య, సతీష్, ఆకుల గురవయ్య, పాశం రమేష్, యరగాని నర్సమ్మ, తాళ్ల గురవయ్య, వెంకటేష్, యరగాని వెంకటమ్మ, కీర్తి సైదులు, కాసాని గురవయ్య ఉప్పతల పిచ్చయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆడపిల్లలకు ఆ భూములనే కట్నంగా ఇచ్చారని, వాటిని సాగుచేసి జీవనం వెళ్లదీస్తున్నామన్నారు. ప్రభుత్వం 70ఎకరాలకు పైగా రెండువిడతల్లో అసైన్డ్ పట్టాలు ఇచ్చిందని, భర్తలు మద్యానికి బానిసలై కుటుంబాలను పట్టించుకోకపోవడంతో పొలంలో వచ్చిన నాలుగు గింజలతో జీవితాలను వెళ్లదీసుకుంటున్నామని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

సమాచారం

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

నల్లగొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందడానికి దోస్త్ ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ శ్రీనివాసరాజు తెలిపారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, పీహెచ్‌డీ, నెట్, సెట్ లాంటి అర్హతలు కలిగిన అనుభవజ్ఞులైన కళాశాల బోధన సిబ్బందితో పాటు డిజిటల్ వర్చువల్ క్లాస్‌రూమ్స్ ఉన్నాయన్నారు. అదే విధంగా విశాలమైన తరగతి గదులు ఆత్యాధునికమైన ల్యాబ్‌రేటరీతో పాటు డిజిటలైజేషన్ చేయబడి ఉన్నాయన్నారు. 25వేలకు పైగా పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన పుస్తకాలే కాకుండా ఉర్దూ మీడియం విద్యార్థులకు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చేరడానికి మొదటి ప్రాధాన్యమివ్వాలని కోరారు. కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ సుంకరి రాజారాం మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థినులకు జిమ్, క్రీడా ప్రాంగణం, ఉచిత బస్సు పాస్ సౌకర్యం, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు హాస్టల్ సదుపాయం ఉందన్నారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు నల్లగొండ కళాశాలను మొదటి ప్రాధాన్యంగా ఎంచుకొని తమ ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. అడ్మిషన్ల కోసం 7799910222, 7799668960, 9491662435, 7013221372నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రజా ఆందోళనతో నిలిచిన విస్తరణ

● యథావిధిగా కొనసాగుతున్న ఎంపీఎల్ పరిశ్రమ ● గతేడాది జనవరిలో పరిశ్రమ విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ ● ప్రజలు వ్యతిరేకించడంతో నిలిచిన పనులు

దుమ్ము ధూళితో కూడిన కాలుష్యాన్ని వదిలే పరిశ్రమ తమ గ్రామాల సమీపంలో ఉండొద్దని ఎంపీఎల్ స్టీల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ స్పాంజ్, ఐరన్ పరిశ్రమ విస్తరణ కోసం గత ఏడాది జనవరిలో చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు అడ్డుకోవడంతో పనులు నిలిచాయి. కాగా ఎప్పటిలానే పరిశ్రమ పనులు యథావిధిగా కొనసాగుతున్నాయి. పరిశ్రమను విస్తరించేందుకు యాజమాన్యం చేసిన ప్రయత్నాలు నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, పర్యావరణవేత్తల నిరసనలతో నిలిచాయి. దీంతో పరిశ్రమ విస్తరణ పనులను విరమించుకుని ఇదివరలా యథావిధిగా నిర్వహించుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-చిట్యాలరూరల్)





వెలిమినేడులో ఎంపీఎల్ పరిశ్రమ వద్ద టెంట్‌ను కూల్చివేసిన గుర్తుతెలియని వ్యక్తులు, పరిశ్రమ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు(ఫైల్ ఫొటో)

చిట్యాల మండలం వెలిమినేడు శివారులో పిట్టంపల్లి రోడ్డులోని ఎంపీఎల్ స్టీల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ స్పాంజ్, ఐరన్ పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యాన్ని 60వేల టీపీఏ నుంచి 1.26లక్షల టీపీఏకు పెంచేందుకు, అదేవిధంగా ఉత్పత్తి ఆధారిత విద్యుత్ ప్లాంట్‌ను 5 నుంచి 10 మెగావాట్లకు పెంచేందుకు గత ఏడాది జనవరి 18వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్రభయాందోళనకు గురై పరిశ్రమను విస్తరించొద్దని నెల రోజులు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన వారు నల్లగొండ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవో, కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారులకు విజ్ఞప్తులు చేశారు. అయినా కూడా ఎవరూ కూడా పట్టించుకోకపోవడం, నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడంతో ప్రజలు ఆందోళన చెందారు.

పెల్లుబికిన ప్రజాగ్రహం

ప్రజాభిప్రాయ సేకరణను చేపట్టొదంటూ ప్రజలు ఎన్నిమార్లు విన్నవించినా విజ్ఞప్తులు చేసినా కూడా పరిశ్రమ విస్తరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం పరిశ్రమ పక్కన గల ఖాళీ స్థలంలో ఏర్పాట్లు చేస్తుండగా పలు గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. టెంట్‌ను కూల్చివేశారు. ఆందోళన చేస్తూ నిరసన వ్యక్తం చేయగా వారిని పోలీసులు అక్కడి నుంచి చెదరగొట్టారు. పోలీసు బలగాలు నిరసనకారులను దూరంగా పంపించారు. అప్పటి డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఎంపీఎల్ పరిశ్రమ వద్దకు చేరుకుని నిరసన చేసే వారితో మాట్లాడారు. పరిశ్రమను తొలగించాలని, విస్తరణ కోసం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడాలని నిరసనకారులకు డీఎస్పీ సూచించడంతో వారు వెళ్లిపోయారు. అప్పటి నుంచి పరిశ్రమ యాజమాన్యం విస్తరణ పనులను నిలిపివేసి ఇతర ప్రాంతాల్లో చేపట్టాలని నిర్ణయించుకుంది. అయితే ఇక్కడ మాత్రం ఉన్న పరిశ్రమను యథావిధిగానే కొనసాగిస్తున్నారు.

అన్నీ కాలుష్యం

ప్రస్తుతం ఉన్న పరిశ్రమతో గాలి, నీరు, భూమి కలుషితం అవుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బోర్లు వేస్తే రంగు మారిన నీరు రావడం, వ్యవసాయ భూములు మసిబారుతుండటంతో సాగు లేక రైతులు అంగా నష్టపోతున్నారు. దీనికి తోడు ప్రజారోగ్యం దెబ్బతినడంతో పాటు కనీసం పశువులు మేసేందుకు శుభ్రమైన గడ్డి కూడా దొరకని పరిస్థితి నెలకొంది. బూడిద మొత్తం గడ్డిపై పరుచుకుంటుండటంతో గ్రాసాన్ని తినడంలేదని రైతులు తెలిపారు. పరిశ్రమ కాలుష్యంతో ఇబ్బంది పడుతున్న వెలిమినేడు, బొంగోనిచెర్వు, పిట్టంపల్లి, పేరేపల్లితో పాటు చుట్టుపక్కల సమీప గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని పరిశ్రమ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్ని ఇబ్బందులతో తమ ప్రాంతం నుంచి పరిశ్రమను తొలగించాలంటే అదీ చాలదని విస్తరణ చేసేందుకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోయారు. పరిశ్రమ విస్తరణను నిలిపివేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను నిలదీశారు.

గ్రామాల నడుమ కాలుష్య పరిశ్రమలొద్దు



గ్రామాల నడుమ కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలొద్దు. అలాంటి వాటితో ఏనాటికైనా హాని తప్పదు.దుమ్ము, ధూళితో అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. ఎంతోమంది ఆసుపత్రుల పాలై ఇబ్బందులుపడుతున్నారు. భూగర్భజలాలు రంగుమారి కలుషితం కాగా బోర్లలోంచి రంగు మారిన నీరు వస్తోంది. వ్యవసాయ భూములు మసిబారుతున్నాయి. పశువులు గ్రాసాన్ని తినలేకపోతున్నాయి. కాలుష్యకారక పరిశ్రమలు గ్రామాల నడుమ ఉండొద్దు. అధికారులు లాలూచితో ఇలాంటి కంపెనీలకు అనుమతులిస్తున్నారు. పరిశ్రమను ఇతర ప్రాంతాలకు తరలించి ప్రజలప్రాణాలను రక్షించాలి.

తుమ్మల వెంకట్‌రెడ్డి, పిట్టంపల్లి, చిట్యాల


ప్రజల ప్రాణాలంటే లెక్కలేదు



కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు మొరపెట్టుకున్నా ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రజల ప్రాణాలంటే వారికి లెక్కలేనట్లుగా ఉంది. కాలుష్య నియంత్రణ మండలి శాఖ అధికారులు ఏం తనిఖీలు చేస్తారో తెలియని పరిస్థితి. తనిఖీలు చేపట్టరు, కాలుష్యం రాకుండా చర్యలు తీసుకునేలా చేయరు. మేము కూడా ప్రజల్లో భాగమే అని ఏరోజూ అనుకోరు. అనుకుంటే ఈ పరిస్థితి ఉండదు. కాలుష్యంతో దుమ్ము, ధూళి వస్తుందని మొరపెట్టుకున్నా పట్టించుకునే పరిస్థితులు లేవు. ఏ అధికారైనా ఒకరోజు ప్రజల మధ్యలో ఉంటే మా పరిస్థితులు అర్థమవుతాయి.

కొలను సతీష్‌గౌడ్, మాజీ సర్పంచ్, పేరేపల్లి

వేసవిలో నేర్చుకుందాం



నల్గొండలో తైక్వాండో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- సెలవుల్లో విద్యార్థుల నైపుణ్యమే లక్ష్యంగా శిబిరాలు
- వివిధ నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ
- క్రీడలు, డ్యాన్స్, డ్రాయింగ్, వాయిద్యం, మెడిటేషన్, సంగీతంలో శిక్షణ
- విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభ వెలికితీసేందుకు దోహదం

వేసవి సెలవులు అనగానే విద్యార్థులు ఎగిరి గంతేస్తారు. 40 రోజులపాటు పిడుగుల్లా మారిపోతారు. ఇల్లు పీకి పందిరి వేస్తారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. పిల్లలకు ఆసక్తి ఉన్న అంశాలపై శిక్షణ ఇప్పించేందుకు సమ్మర్ క్యాంపుల కోసం వెతుకుతున్నారు. డ్యాన్స్, డ్రాయింగ్, మెడిటేషన్, శ్లోకాలు, సంగీతం నైపుణ్యాలపై ఇప్పిస్తున్నారు. తెలంగాణ రైజింగ్..యంగ్ ఇండియా పేరిట ప్రభుత్వం కూడా ఎంపిక చేసిన పాఠశాలల్లో వేసవి సెలవుల్లో శిక్షణ ఇస్తోంది. ఇందుకోసం వలంటీర్లను నియమించింది. వివిధ అంశాలపై నేర్చుకునే ఉత్సాహం ఉన్న విద్యార్థుల ప్రతిభ వెలికితీసేందుకు ఈ శిక్షణలు దోహదం చేస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ/నల్లగొండ స్పోర్ట్స్)

నేటి తరం చిన్నారులు వివిధ నైపుణ్యాలను నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వేసవి శిబిరాల వైపు పరుగులు పెడుతున్నారు. కొత్తది నేర్చుకునేందుకు మరో రంగంలో ప్రావీణ్యం సంపాదించేందుకు ఆసక్తి చూపుతున్నారు. సంగీతం, డ్యాన్స్, బొమ్మలు వేయడం, తైక్వాండో, కరాటే, క్రికెట్ ఒకటేమిటి లెక్కలేనని కోర్సులు నేర్పించడానికి అనేక వేసవి శిక్షణ శిబిరాలు ఉన్నాయి. డీవైఎస్‌వో ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాలో 13 వేసవి సమ్మర్ క్యాంపులను ప్రారంభించారు.

జిల్లా బాలభవన్ కేంద్రం ఆధ్వర్యంలో..

వేసవి సెలవుల్లో చిన్నారులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు జిల్లా విద్యాశాఖ, బాల భవన్ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సంగీతం, డ్రాయింగ్, తబలా, నృత్యం వంటి రంగాల్లో ఉచిత వేసవి శిక్షణ ఇస్తున్నారు. పట్టణంలోని బోయవాడ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో బాలు మాస్టర్ ఆధ్వర్యంలో మాస్టర్స్ సంగీతం, డ్రాయింగ్, తబలా, నృత్యం అల్లికలు వంటి కళారంగాల్లో మెళకువలు నేర్పిస్తున్నారు.

ఇంగ్లీష్‌లో తర్ఫీదు..

ఇంగ్లీష్ మాట్లాడడం ప్రస్తుతం తప్పనిసరి. ఇందుకు వేసవి సెలవులను విద్యార్థులు చక్కగా వినియోగించుకుంటున్నారు. పట్టణంలో నాలుగు నుంచి ఐదు వరకు స్పోకెన్ ఇంగ్లీష్ శిబిరాలు ప్రారంభమయ్యాయి. క్లాసులు బట్టి నిర్వాహకులు రూ.2వేల నుంచి రూ.3వేల ఫీజులను వసూలు చేస్తున్నారు.

కంప్యూటర్ రంగంలో శిక్షణ

ప్రతి ఒక్కరికి కంప్యూటర్ గురించి తెలిసి ఉండాలి. చాలా పాఠశాలల్లో కంప్యూటర్ విద్య కొనసాగుతుంది. పాఠశాలలో కంప్యూటర్లు అందుబాటులో లేని విద్యార్థులు వేసవిలో కంప్యూటర్ శిక్షణ కేంద్రాలకు వెళుతున్నారు.

విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి చాలామంది వివిధ కోర్సులను ప్రవేశపెట్టారు. కేంద్రాల్లో నెలరోజులకు ఒక్కొక్కరి నుంచి రూ. వెయ్యి నుంచి రూ. 2వేల వరకు వసూలు చేస్తున్నారు.



చిత్రలేఖనంలో మెళుకువలు నేర్పిస్తున్న శిక్షకుడు

ఈత కొలనులో..

జిల్లా కేంద్రంలోని ఇండోర్స్ స్టేడియంలో గల ఈతకొలను, నల్లగొండ క్లబ్‌లోని ఈత కొలను, కాలనీలో గల ఈతకొలంలో పిల్లలు,పెద్దలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఈత కొడుతూ ఆహ్లాదకరంగా గడుపుతున్నారు.

ఇవి గుర్తుంచుకోండి

భద్రత అనేది అన్నింటి కంటే ముఖ్యం. చిన్నపిల్లలైతే వాళ్ల వెళ్లి పాఠశాలల్లో ఏర్పాటు చేసే దేశ శిక్షణ శిబిరాలకు పంపించడం ఉత్తమమైన మార్గం. ఇంటికి దగ్గరలో పరిశుభ్రమైన వాతావరణంలో భద్రత ఉన్న కేంద్రాలను ఎంపిక చేసుకొని తల్లిదండ్రులు దగ్గర ఉండి మరి పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాల్లో నైపుణ్యాలు నేర్పించుకోవాలి.

ఆటల్లో పట్టు సాధించేలా..

డీవైఎస్‌వో ఆధ్వర్యంలో జిల్లాలో ఎంపిక చేసిన 13 ప్రాంతాల్లో బాల, బాలికల కోసం ప్రత్యేకంగా వేసవి శిక్షణ శిబిరాలను పలు క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హాకీ, తైక్వాండో, కరాటే, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో శిక్షణ పొందుతున్నారు.



నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో బ్యాండ్మింటన్ శిక్షణ పొందుతున్న చిన్నారులు

సూర్యాపేట బాలభవన్ సందడి

సూర్యాపేట అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలభవన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఐదు సంవత్సరాల వయ స్సు నుంచి 16సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులకు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాతలో బాలభవన్ ఆధ్వర్యంలో వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఏ రంగంలో ఇష్టముంటే ఆ రం గంలోనే శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 42రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. డ్యాన్స్, డ్రాయింగ్, ఎంబ్రాయిడరీ, వాయిద్యం, మెడిటేషన్, నీతి కథల శ్లోకాలు, మ్యూజిక్ లో శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల్లో చదివే ఎస్సీఎస్టీ విద్యార్థుల కు క్యాస్ట్ సర్టిఫికెట్‌తో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. మిగితా విద్యార్థుల కు ఒక్కొక్కరికి రూ.50ఎంట్రీ ఫీజు వసూలు చేస్తున్నారు. డ్యాన్స్‌లో వంద మంది విద్యార్థులు, సంగీతంలో 55మంది, డ్రాయింగ్ 120 మంది, మ్యూజిక్ 60మంది విద్యార్థులు, క్రాఫ్ట్ 15మంది విద్యార్థులు శిక్షణలో ఉన్నారు.



నృత్యం నేర్చుకుంటున్న విద్యార్థులు





మృదంగం, తబలా వాయిస్తున్న విద్యార్థులు

పట్టణంలో ని శివసాయి పిరమిడ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉదయం ఏడు గంటలకే మెడిటేషన్ ప్రతిరోజూ నిర్వహిస్తారు.



విద్యార్థులకు ఉపయోగపడతాయి

బాలభవన్ ఆధ్వర్యంలో నిర్వహించే పలు శిక్షణలు విద్యార్థులకు ఉపయోగపడతాయి. శిక్షణలో అనేక అంశాలు నేర్చుకునే అవకాశం ఉన్నందున ఈ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో శిక్షణలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు నేర్చుకునే వాటికే ప్రాధాన్యం ఇస్తున్నాం.

- రాధాకృష్ణారెడ్డి, ప్రభుత్వ బాలభవన్ నిర్వాహకులు, సూర్యాపేట.




డ్యాన్స్ నేర్చుకుంటున్నా

బాలభవన్‌లో డ్యాన్స్ నేర్చుకుంటున్నా. సెలవులు కావడంతో డ్యాన్స్‌పై నాకు మక్కువ ఎక్కువ. ఈ శిక్షణ శిబిరాలు ఎంతగానో తోడ్పడుతాయి.

- జాహ్నవి, 5వ తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని

రైజింగ్..యంగ్ ఇండియా

సూర్యాపేట జిల్లాలో ఎంపిక చేసిన 50 పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ



డ్రాయింగ్ నేర్చుకుంటున్న విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి, కోదాడ): విద్యార్థుల్లో నైపుణ్యం మెరుగు పరచాలని తెలంగాణ పాఠశాల విద్యాశాఖ తెలంగాణ రైజింగ్.. యంగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరానికి శ్రీకారం చుట్టింది. మంగళవారం నుంచి ఈ నెల 20వరకు శిక్షణ శిబిరం నిర్వహించేందుకు, పాఠశాలలను ఎంపిక చేసింది. ఎంపికైన పాఠశాలలో 100మంది విద్యార్థులకు 15రోజుల పాటు డాన్స్, డ్రాయింగ్, వాలీబాల్, వ్యక్తిత్వ వికాసంపై ఉదయం 8 నుంచి 11వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. విద్యార్థుల్లో శారీరక, మానసిక దృఢత్వంతో పాటు, జీవన నైపుణ్యంతో కూడిన మంచి అలవాట్లు, నడవడికే శిక్షణ శిబిరం ఉద్దేశం. సూర్యాపేట జిల్లాలో 50పాఠశాలలను ఎంపిక చేయగా, ఐదు వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలో 680 ప్రాథమిక, 80ప్రాథమికోన్నత, 234 జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలలు, మొత్తం 994 పాఠశాలలు ఉన్నాయి. ఒక్కొక్క మండలంలో రెండు పాఠశాలల చొప్పున, కొన్ని చోట్ల మూడు చొప్పున, మొత్తం జిల్లాలో 50పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కొక్క పాఠశాలలో 100మంది విద్యార్థులు, మొత్తంగా 5వేల మంది విద్యార్థులు డాన్స్, డ్రాయింగ్, వాలీబాల్, వ్యక్తిత్వ వికాసంలో శిక్షణ పొందనున్నారు. ఒక్కో విద్యార్థిపై అల్పాహారం కోసం ప్రభుత్వం రూ.15 ఖర్చు చేయనుంది. విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు, ఒక్కో పాఠశాలకు నలుగురు చొప్పున, ప్రావీణ్యం పొందిన 200మంది వలంటీర్లను విద్యాశాఖ ఎంపిక చేసింది. ఒక్కో వలంటీర్‌కు 15రోజులకు రూ.3వేల చొప్పున వేతనం అందించనున్నారు.



డాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు



శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికితీసేందుకు, వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేసింది. 15రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు విద్యార్థులకు ఉపయోగపడతాయి. ఆరు నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు శిక్షణకు అవకాశం ఇచ్చారు.ప్రతిరోజకూ నాలుగు గంటల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు.

- ఎండీ. సలీం షరీఫ్, ఎంఈవో

డ్యాన్స్ మాస్టర్లంతా ఐక్యంగా ఉండాలి

- ఏ జిల్లా వారు ఆజిల్లాలోనే డ్యాన్స్‌లు నేర్పించాలి
- డ్యాన్స్ మాస్టర్ల జిల్లా కమిటీ తీర్మానం



సమావేశంలో పాల్గొన్న డ్యాన్స్‌మాస్టర్లు

మిర్యాలగూడ, మే 6(ఆంధ్రజ్యోతి): డ్యాన్స్ మాస్టర్లంతా ఐక్యంగా ఉండాలని డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాతనబోయిన శేఖర్, పట్టణ అధ్యక్షులు అలుగుబెల్లి వెంకట్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడలో అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ జిల్లాకు చెందిన డ్యాన్స్ మాస్టర్‌లు ఆ జిల్లాలోనే డ్యాన్స్‌లు నేర్పించాలన్నారు. ఇతర జిల్లాలకు వెళ్లి నృత్యాలు నేర్పించరాదన్నారు. ఇందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే అసోసియేషన్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామన్నారు. అసోసియేషన్‌లో అందరూ సభ్యత్వం పొందాలన్నారు. సమావేశంలో డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ స్టేట్ కమిటీ సభ్యులు గణేష్, భాను, శేఖర్, రాములు జిల్లా, వివిధ మండలాల డ్యాన్స్ మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

చెట్టు నీడ..చల్లదనపు జాడ

- చరిత్ర పుటల్లో నిలిచిన వృక్షాలు
- వృక్షో రక్షితి రక్షతఃకు నిదర్శనంగా ఆ వృక్షాలు

(ఆంధ్రజ్యోతి, వేములపల్లి)

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అంటూ ఉంటారు. 'ఏ చెట్టు పచ్చగా ఉంటే ఆ చెట్టు కిందకి చేరుతారు' అనేది నానుడి. మండుటెండలో బయలుదేరే బాటసారులు చెట్ల నీడన కాసేపు సేదదీరుతారు. స్థానికులు, పాదచారులు, వాహనదారులు, ఇతర సంచార జీవనం సాగించే వారికి కూడా చెట్లనీడే ఆధారమవుతోంది. పూర్వీకులు నాటిన మొక్కలే నేడు మానులై గ్రామ చరిత్రలో ప్రముఖంగా నిలుస్తున్నాయి. చరిత్ర పుటల్లో నిలిచి ఆయా ప్రాంతాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తున్నాయి. వాటిలో ఒక్కొక్క చెట్టుకు ఒక్కో చరిత్ర, వాటి స్థితిగతులను బట్టి దశాబ్దాలుగా ప్రత్యేక పేర్లతో పిలుస్తున్నారు. 'వృక్షో రక్షతి రక్షితః' అంటే వృక్షాలను రక్షిస్తే అవి మానవాళిని రక్షిస్తాయి అనేది నానుడి. పర్యావరణ పరిరక్షణకు సైతం వృక్షజాతులను రక్షింకోవాల్సిన అవసరం ఉంది.





రావులపెంటలో వనం మైసమ్మ మర్రి

రావులపెంట గ్రామం సమీపంలోని నాగార్జునసాగర్ ఎడమ కాల్వ 72వ కిలోమీటర్ సమీపంలోని బ్రిడ్జి వద్ద సుమారు 65 సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన మంద సోమయ్య అనే వ్యక్తి ఒక చిన్న మర్రి మొక్కను తెచ్చి నాటాడు. మండు వేసవిలో సైతం సమీపంలోని అర కిలోమీటర్ దూరంలో ఉన్న పాలేరు నుంచి ప్రతి నిత్యం ముంతలో నీరు తెచ్చి నిత్యం పోసి రక్షించాడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. పశు పక్ష్యాదుల నుంచి ఆ చిన్న మొక్కను సంరక్షించగా నేడు ఆ మొక్క మహావృక్షమై పలువురికి నీడ ఇవ్వడంతోపాటు ఇతర జీవజాతులకు ఆశ్రయాన్ని కల్పిస్తోంది. ఇదే చెట్టు కింద గ్రామానికి చెందిన కల్లుగీతకార్మికులు మైసమ్మ గుడిని నిర్మించుకోగా నేడు ఆ చెట్టు వనం మైసమ్మ మర్రిగా పేరొందుతోంది. ఇదే మార్గం గుండా పెన్‌పహాడ్, నేరేడుచర్ల, సూర్యాపేట మండలాలకు రాకపోకలు సాగించే బాటసారులు సమీప గ్రామంలోని రైతులు ఆ చెట్టును చూడగానే కాసేపు సేదతీరాలనే భావనతో ఆగిపోతారంటే అతిశయోక్తికాదు. సోమయ్యకు వారసులు ఎవరూ లేకపోయినా దశాబ్దాలకాలం క్రితం నాటిన చిన్న మొక్క నేడు మహా వృక్షంగా మారి ఆయన వారసత్వ సంపదగా తరతరాలకు గుర్తుండిపోయేలా ఆ మర్రి మహా వృక్షం చరిత్ర పుటల్లో నిలిచిపోతోంది.

చిత్రపరక బ్రిడ్జి మర్రి

వేములపల్లి గ్రామ శివారులోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై చిత్రపరక వాగు సమీపంలో సుమారు 200 సంవత్సరాల క్రితం మొలకెత్తిన మర్రి నేడు అర ఎకరం విస్తీర్ణంలో విస్తరించి ఉంది. నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై సుదూర ప్రాంతాలకు ప్రయాణించే పలువురు బాటసారులు ఈ మర్రిచెట్టు కింద సేద తీరుతూ ఉంటారు. ఈ రహదారిపై నిత్యం ఆంధ్రా, తమిళనాడు నుంచి పలువురు బాటసారులు హైద్రాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్న సమయంలో బాటసారులు ఈ మర్రిచెటుకు ఆకర్షితులై దాని చెంత చేరి తమ వెంట తెచ్చుకున్న పదార్థాలను తిని కొద్దిసేపు సేదదీరుతూ ఆనందంగా గడుపుతుంటారు. రహదారిపై చూపరులను ఆకట్టుకుంటూ తన చెంతన సేదీదీరేందుకు బాటసారులను తన చెంతకు ఆహ్వానిస్తోంది. ఆదివారం వచ్చిందంటే సమీప గ్రామాల్లోని పలువురు యువకులు, భూముల్లేని పలువురు గ్రామస్థులు ఈ మర్రి చెంతకు చేరి వన భోజనాలు, విందులతో ఆనందంగా గడుపుతుంటారు.

దొరవారి వేప చెట్టు

ఆమనగల్లులోని దొరవారి కోట బురుజు సమీపంలోని వేపచెట్టుకు తరతరాల నాటి చరిత్ర ఉంది. ఈ వేపచెట్టును సుమారు 150 సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన గడ్డం రామకృష్ణారెడ్డి అనే దొర నాటాడు. నాటి నుంచి ఆ వేపచెట్టుకు దొరవారి వేపచెట్టుగా గుర్తింపు పొందింది. చెట్టు నాటిన తొలి నాళ్లలో గాలివాన బీభత్సానికి చెట్టు కూలి పోగా తిరిగి అదే వేప చెట్టును అక్కడే నాటి దానిచుట్టు రాతి కట్టడాన్ని కట్టించాడు. గ్రామంలో ఏ ఒక్కరికి సమస్య వచ్చినా, తగాదా వచ్చినా దొరవారి వేపచెట్టు కిందకు వెళ్దాంపదా అంటూ అక్కడికి చేరి గ్రామ పెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. నేటికి గ్రామంలోని ప్రతి ఒక్కరు ఎప్పుడో ఒక్కసారి ఆచెట్టు కిందకు చేరి సేదతీరుతూ ఉంటారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



యాదగిరిగుట్ట, మే 6 (ఆంధ్రజ్యోతి) యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణీ వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి, నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్పటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 24,59,433 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.

అకాల వర్షంతో అపార నష్టం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సోమవారం రాత్రి కురిసిన వడగండ్లు, ఈదురుగాలులతో కూడిన వర్షంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. తోటల్లో మామిడి కాయలు రాలాయి. కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. పలుప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. తీగలు తెగాయి. దామరచర్ల మండలంలోని పురాతన ఆలయాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. అకాల వర్షంతో రైతులు చాలా నష్టం పోయారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

భువనగిరి మండలంలోని వీరవెల్లి, చందుపట్ల, బండసోమారం గ్రామాల్లోని కొనుగోలు కేందాల్లో ధాన్యం తడిసింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయ కేంద్రాలకు తరలించగా తేమ, సాకు నేపంతో కొనుగోలులో అధికారులు జాప్యం చేసినందునే ధాన్యనం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలోనే మూడు సార్లు వర్షం కురసింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుని వాటిపై కవర్లు కప్పి ఉంచడంతో వర్షంతో ధాన్యం రాసులు కింది భాగం వరద నీరు చేరి తడిసాయి. ధాన్యం తడిసి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వీరవెల్లి గ్రామానికి చెందిన రైతు సోకం కృష్ణమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో పేరుకపోయిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలని ఆయన అధికారులును కోరారు.



దామరచర్లలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఒరిగిన ధ్వజస్తంభం

- మోత్కూరు మండలంలో సోమవారం రాత్రి కురిసిన గాలివానకు మామిడి తోటల్లో కాయలు రాలాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు తడిశాయి. బుజిలాపురం, అనాజిపురం, మోత్కూరు, ముశిపట్ల తదితర గ్రామాల్లో తోటల్లో మామిడి కాయలు రాలాయి. మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో తన ఐదెకరాల మామిడి తోటలో గాలివానకు కాయలు రాలి సుమారు రూ.2.60 లక్షల నష్టం వాటిల్లిందని రైతు ఏనుగు జితేందర్‌రెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసులపై టార్పాలిన్లు కప్పినప్పటికీ రాసుల అడుగులు తడిశాయి. కొనుగోళ్ల వేగం పెంచి తూకం వేసిన బస్తాలు వెంటనే మిల్లులకు తరలించేలా చూడాలని ధాన్యం రైతులు కోరుతున్నారు.
- కనగల్ మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురసింది. బుడుమర్లపల్లి, కనగల్ తదితర గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం రాశులు తడిశాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు కూలాయి. తీగలు తెగి పడటంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలుల తాకిడికి పలు ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి.
- చండూరు మండలంలో మంగళవారం కురిసిన అకాల వర్షానికి కూరగాయల రైతులకు తీరని నష్టం వాటిల్లింది.
- గుర్రంపోడు మండలంలోని లక్ష్మీదేవిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసినందున రైతులు ఆందోళనకు దిగారు. లారీల కొరతతో రోజులు తరబడి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరిగినందున తాము నష్టపోయామని రైతులు తెలిపారు. లారీలను అందుబాటులోకి తెచ్చి కొనుగోళ్ల వేగవంతం చేస్తామని కొనుగోలు కేంద్రం మానిటరింగ్ అధికారి కమలాకర్ హామీ ఇవ్వడంతో ఆందోళనను రైతులు విరమించారు.



భువనగిరిలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు సోకం కృష్ణమూర్తి

ఈదురుగాలులకు ఒరిగిన ధ్వజ స్తంభం

- ఈదురుగాలులతో కూడిన వర్షంతో దామరచర్ల మండలంలోని వాడపల్లి గ్రామశివారులోని పురాతన లక్ష్మీనరసింహస్వామి, మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ధ్వజస్తంభం పక్కకు ఒరగగా, శివాలయంలోని భారీచెట్లు నేలకొరిగాయి. ఆలయ పునరుద్ధరణలో భాగంగా 1995లో అప్పటి ఇండియా సిమెంట్స్ యాజమాన్యం ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్లు కొందూటి సిద్ధయ్య, పొదిల శ్రీనివాస్ తెలిపారు. మహిమాన్విత పురాతన ఆలయాలు దెబ్బతినడంపై అర్చకులు నాగేంద్ర ప్రసాద్‌శర్మ, సాంబశివరావుశర్మ, రామానుజాచార్యులు, గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు.
- మేళ్ళచెర్వు మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం వీచిన గాలికి రోడ్డు పక్కన ఏర్పాటుచేసిన బడ్డీ కొట్టు రోడ్డుకు అడ్డంగా పడింది. గాలి ఉధృతికి విద్యుత్ వైర్లు తెగి బడ్డీ కొట్టు మీద అడ్డంగా పడ్డాయి. ప్రమాద సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం, ఆ సమయంలో జన సంచారం లేనందున పెను ప్రమాదం తప్పింది.

టీఎస్ఈఈయూ మండల అధ్యక్షుడిగా వెంకటేష్



చిట్యాల, మే 6,(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 327(టీఎస్ఈఈయూ) చిట్యాల మండల అధ్యక్షుడిగా పగడాల వెంకటేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సాయి మణికంఠ దేవాలయ అధ్యక్షుడిగా వెంకన్న



కట్టంగూరు, మే 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సాయి మణికంఠ దేవాలయ అధ్యక్షుడిగా కట్టంగూరుకు చెందిన గాదగోని వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఆలయ కమిటీ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఆలయ శాశ్వత చైర్మన్ జెల్లా ముత్తిలింగం వెంకన్నకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని వెంకన్న తెలిపారు.

మర్కట విహారం

● పల్లెపహాడ్, బెండల్‌పహాడ్ గ్రామాల్లో భయం భయం
● ఇళ్లలోకి వచ్చి వస్తువులు చిందర వందర
● పంటలను ధ్వంసం చేస్తున్న వానరసేన



గుంపుగా వెళ్తున్న కోతులు, కోతుల దాడిలో గాయపడిన వృద్ధురాలు

నార్కట్‌పల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): వానరసేన మూకుమ్మడి దాడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోతుల సమస్యకు చెక్ పెట్టేందుకు గతంలో చేసిన కొండెంగ ప్రయత్నం విఫలమైంది. కోతులు విపరీతంగా ఉన్న బాధిత గ్రామాల్లో కాకుండా కోతుల సమస్య అంతగా లేని గ్రామాల్లో మండల అధికారులు మంకీ ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేశారు. మండలంలోని పల్లెపహాడ్, బెండల్‌పహాడ్ గ్రామాల్లో వానర మూకల దాడులతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కేవలం పంట పొలాల వద్దకు గుంపుగా వెళ్లి తోటలను ధ్వంసం చేసేవి. క్రమంగా అవి గ్రామంలోకి చేరి ఇంట్లోకి వచ్చి తమ చేష్టలతో ఇంట్లో ఉన్నవాళ్లను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇంట్లో పనిచేసుకుంటున్న వాళ్లపై కూడా హఠాత్తుగా దాడి చేసి గాయపరుస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారు. కిరాణా ఇతర షాపులైతే సరేసరి. కోతులతో వేగలేక షాపులకు రక్షణగా కొందరు ఇనుప జాలి ఏర్పాటు చేసుకున్నారు. ఇంట్లో ఉన్న వంగాల పార్వతమ్మపై దాడి చేసి కోతులు గాయపర్చాయి.

కోతులను తరలించాలి



పంటలనే కాకుండా ఇంట్లోకి జొరబడి వస్తువులను చిందరవందర చేయడంతో పాటు గాయపరుస్తున్న కోతులను ఇక్కడి నుంచి అటవీ ప్రాంతానికి తరలించాలి. అసలే కుక్కలతో భయపడుతుంటే వీటికి తోడుగా కోతులు గుంపులుగా వస్తూ దాడి చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పాఠశాలకు వెళ్లి వస్తానో లేదా వీధుల్లో ఆడుకుంటున్నప్పుడో చిన్నపిల్లలపై ఎక్కడ దాడి చేస్తాయోనన్న భయం ఉంది. ఈ సమస్యపై అధికారులకు, గ్రామ పంచాయతీ పాలకవర్గానికి చెప్పినా పరిష్కారం కావడం లేదు.

● జలంధర్, మాజీ వార్డుసభ్యుడు.

ఎంఎఫ్‌సీ కోసం ప్రభుత్వ స్థలం లేదు



కోతుల బెడద తీవ్రంగా ఉన్న పల్లెపహాడ్, బెండల్‌పహాడ్ గ్రామాల్లో మంకీ ఫుడ్‌కోర్టు (ఎంఎఫ్‌సీ)లను ఏర్పాటు చేద్దామనుకుంటే ప్రభుత్వ స్థలం లభించలేదు. ఆ గ్రామాల్లో మంకీ ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రాధాన్యంగా గుర్తించాం కానీ ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ఏర్పాటు చేయలేదు.

● యాదయ్య, ఏపీవో, నార్కట్‌పల్లి.

రాత్రివేళల్లో పోలీసుల గస్తీ పెంచాలి



ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

నల్లగొండ టౌన్, మే6 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు దొంగల బెడద ఎక్కువతున్నందున రాత్రివేళల్లో పోలీసుల గస్తీ ముమ్మరం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో టూ టౌన్ ఎస్ఐ ఎర్ర సైదులుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. టూ టౌన్ పరిధిలోని శివారు కాలనీలైన శ్రీనగర్‌కాలనీ, న్యూఎన్జీవోస్ కాలనీ, గొల్లగూడ, పెద్దబండ, రైల్వేస్టేషన్, శ్రీరామ్‌నగర్‌కాలనీ, హైదరాబాద్ రోడ్డు ప్రాంతాల్లో దొంగల బెడద అధికంగా ఉందన్నారు. రాత్రి సమయాల్లో కాలనీల్లో పెట్రోలింగ్ నిర్వహించాల కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిర్యాల వెంకటేశం, బీపంగి జగ్జీవన్, గుండా నవీన్‌రెడ్డి, గడ్డం మహేష్, మంగలిపల్లి కిషన్, టంగుటూరి శ్యామ్, దాసరి వెంకన్న, తిరందాసు కనకయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లీష్ సులభంగా నేర్చుకోవచ్చు



స్పోకెన్ ఇంగ్లీష్ నిర్వాహకుడు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

నల్లగొండ, మే 6(ఆంధ్రజ్యోతి): సులభమైన పద్ధతిలో స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకోవచ్చని, అందుకు అనుగుణంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని స్పోకెన్ ఇంగ్లీష్ నిర్వాహకుడు అంబటి శ్రీనివాస్ తెలిపారు. స్పోకెన్ ఇంగ్లీష్ ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లాకేంద్రంలో మంగళవారం కేక్‌కట్ చేశారు. విద్యార్థులు, గృహిణులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, పోటీ పరీలకు సిద్ధమయ్యే వారికి స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాముల అశోక్, ఎస్. వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సీహెచ్. కరుణ, వి. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

'అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల ఇవ్వాలి'

చండూరు రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు ముదిగొండ అంజనేయులు కోరారు. సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టర్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. అధికార పార్టీ నాయకులు వారికి నచ్చిన వారికి ఇప్పస్తున్నారని ఆరోపించారు. కారు, ట్రాక్టర్, ఎక్కువ భూమి, గతంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిపొందిన వారికి మంజూరు చేయిస్తూ నిజమైన అర్హులకు, నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నకిరేకంటి లింగస్వామి గౌడ్, మన్యం ప్రవీణ్, పోతరాజు శ్రీహరి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

కట్టంగూరు, మే 6(ఆంధ్రజ్యోతి): పోరాట స్ఫూర్తితో కార్మికులు హక్కుల కోసం ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బొమ్మిడి నగేష్ పిలుపునిచ్చారు. మండలంలోని బొల్లేపల్లి గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మే డే నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలన్నారు. కార్మికులకు హెల్త్‌కార్డుతో పాటు పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొట్టపల్లి రామకృష్ణ, జంజిరాల క్రాంతి, రుద్రాక్షి వెంకన్న, ఉట్కూరి సైదులు, మహేష్, ప్రవీణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న కరణ్ జయరాజ్ తదితరులు

నల్లగొండ రూరల్, మే 6: ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా ఉంటామని మహనీయుల ఆశయ సాధన సేవ సంఘం, మాదిగ సంఘా జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కరణ్ జయరాజ్ అన్నారు. కంచనపల్లి గ్రామానికి చెందిన యువకులు కొప్పుల సంపత్, దోమలపల్లి గ్రామానికి చెందిన సింగపంగ మల్లయ్య అనారోగ్యంతో మృతిచెందగా వారి కుంటుంబాలను మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.5వలే చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్, కందుల లక్ష్మయ్య, దుబ్బా రూప అశోక్ సుందర్, కత్తుల తులసీదాస్, చింత శివరామకృష్ణ, పెరిక అంజయ్య, ప్రసాద్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు విధిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

చండూరు రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి పి. మల్లేష్ అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామంలోని రైతువేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనేది ఆధార్ లాగే ప్రతి ఒక్క రైతు నమోదు చేసుకోవాలని, దీని ద్వారా రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ, ఇతర పథకాలు ఐడీ ద్వారా ఇస్తారని తెలిపారు. ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ రిజిస్ట్రేషన్ కోసం రైతు ఆధార్‌కార్డు, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్‌తో గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద గాని, సమీపంలోని మీసేవ సెంటర్ల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెలాఖరులోగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నకిరేకల్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, మే 6, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూరు, నార్కట్‌పల్లి, చిట్యాల మండలాలకు చెందిన 300మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే పథకాలు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, నకిరేకల్, చిట్యాల ఏఎంసీ చైర్మన్‌లు గుత్తా మంజుల మాధవరెడ్డి, నర్రా వినోద మోహన్‌రెడ్డి, నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం నకిరేకల్ పట్టణంలో ఎమ్మెల్యే వేముల వీరేశం అందజేశారు. ఇటీవల మండల వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 34మందికి కల్యాణలక్ష్మి, 10మందికి సీఎంఆర్ఎఫ్ మంజూరయ్యింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె. శ్రీనివాసయాదవ్, నాయకులు జి.మాధవరెడ్డి, బడుగుల నరేందర్‌యాదవ్, మట్టి సాల్మన్, కత్తుల వీరన్న, కె.కృష్ణయ్య. వినయసాగర్ పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీదేవి

నాంపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని చండూరు ఆర్డీవో శ్రీదేవి ఆదేశించారు. చండూరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చేటప్పుడు తాలు లేకుండా తేమ శాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలలోని మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు , నీడను కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దేవాసింగ్, సింగిల్ విండో చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రంగంలో ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి



రైల్వేస్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): రైల్వే రంగంలో ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. సంఘం ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట మంగళవారం ప్లకార్డులతో నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేలో భద్రతా చర్యలు పెంచి, ప్రయాణికుల, సిబ్బంది ప్రాణాలు కాపాడాలన్నారు. దేశంలో ఇటీవల వరుసగా అనేక రైలు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రయాణికులు, లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు, ట్రాక్ మైంటైనేర్స్, కాంటాక్ట్ వర్కర్స్ వివిధ కేడర్ల రైల్వే కార్మికులు ఉద్యోగులు కూడా పెద్ద సంఖ్యలో చనిపోతున్నారని అవేదన వ్యక్తం చేశారు. నేటికీ మనదేశంలో వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి రైలు ప్రయాణమే తక్కువ ఖర్చు గల రవాణా మార్గం అని అన్నారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రైల్వే వ్యవస్థను కేంద్రం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటీకరించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ. సలీం, నాకులు దండెంపల్లి సత్తయ్య, అద్దంకి నరసింహ, సలివోజు సైదాచారి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలకు జలాభిషేకం



విగ్రహాలు జలాభిషేకం చేస్తున్న మహిళలు

నకిరేకల్, మే 6, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నోముల గ్రామంలో ఈ నెల 8వ తేదీన విజయ కనకదుర్గాదేవి ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు మహిళలు బోనాలతో వచ్చి జలాభిషేకం చేశారు. పూజలు, యంత్ర అర్చనలు, పంచామృతాలతో అభిషేకాలు, పంచగవ్య అతివాసములు, ప్రతిష్ఠ విగ్రహాలకు జల కుంభములతో అహోషేకములు నిర్వహించారు. కార్యక్రమంలో బోవనగిరి గోపాల కృష్ణశర్మ, వెంకటరమణ, కుంచెం సోమయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలు ఎంచుకోవాలి : డీఎస్పీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నార్కట్‌పల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాలు ఎంచుకొని ఆ దిశగా వెళ్లాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. మండలంలోని ఏపీలింగోటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లీన్‌హోం-గ్రీన్‌హోం వ్యవస్థాపకుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆదిమళ్ల మణిరాజ్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించనున్న వేసవి ఉచిత క్రీడా శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. క్రమశిక్షణతో చదువుకుని భవిషత్‌ను బంగారుమయం తల్లిదండ్రులకు చదువు నేర్పిన గురువులకు మంచి పేరు తేవాలని పిలుపునిచ్చారు. ఆటల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థి ఖలీల్‌ను అభినందించారు. దాత పోరెడ్డి నర్సింహారెడ్డి క్రికెట్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ పోరెడ్డి నర్సింహ్మారెడ్డి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చింతమల్ల లింగయ్య, వస్తుప్పల చంద్రయ్య, ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్, హెచ్ఎం కాశయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విమల, ఎనుగుల శ్రీనివాస్‌రెడ్డి, సామ రాంచంద్రారెడ్డి, బొజ్జ అంజయ్య, ఏశమల్ల సత్యనారాయణ, రాపోలు సత్యనారాయణ, దేవులపల్లి భాస్కర్, మహ్మద్ ఆరీఫ్, కరాటే మాస్టర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత సంఘం అధ్యక్షుడిగా వెంకన్న



వెంకన్న దశరథ

నకిరేకల్, మే 6, (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ కల్లుగీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా కొండ వెంకన్న ఎన్నిక య్యారు. కార్యదర్శిగా మల్లెబోయిన దశరథ, ఉపాధ్యక్షుడిగా చెవుగోని వెంక న్న, కోశాధికారిగా చెవుగోని నాగయ్య, డైరెక్టర్లు తండు వెంకటేశ్వర్లు, కొండ శ్రీను, కొండ యాదమ్మ, తలారి వీరమ్మ, బొప్పని సైదులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా నాగేశ్వర్‌రావు వ్యవహరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

నాంపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని టీడీపీ ఎన్నికల అబ్జర్వర్ రాపోలు నరసింహ, మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జి బడుగు లక్ష్మయ్య అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వం గ్రామాల్లో చేసిన అభివృద్ధి నేటికీ కన్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షురాలు మోగుదల పార్వతమ్మ, ఉపాధ్యక్షులు మేకల యాదగిరి ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మంగి మహేష్, నాయకులు దానబోయిన నరేష్, ఎద్దుల రాములు, ప్రకాష్ శేఖర్, చిర్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగార్జున

నల్లగొండ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన నిర్వహించే సర్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎడ్ల సైదులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, టీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. కార్మికులు, రైతులు కూలీలు, నిన్న జాతులు దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు మహిళలు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు సామాజిక సంఘాలు అధిక సంఖ్యలో సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల సైదులు, నాయకులు, సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, బకరం శ్రీనివాస్, బండా శ్రీశైలం, శివకుమార్, మానుపాటి బిక్షం, రవి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నాంపల్లి, మే 6, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగపాడు గ్రామానికి చెందిన పచ్చిపాల కాశయ్య ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ కడారి శ్రీశైలం యాదవ్ శుక్రవారం వారి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ దండిగా చంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ పచ్చిపాల ఆంజనేయులు, నీలా నరసింహ, నేతళ్ళ యాదగిరి, నేతళ్ళ నరసింహ, పచ్చిపాల నరేష్, నేతళ్ళ నరేష్, పచ్చిపాల అంజి, నరేందర్, సురేష్ పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు అందజేత

కనగల్, మే 6:(ఆంధ్రజ్యోతి): కనగల్ మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డులోని యువకులకు ప్రెస్‌క్లబ్ తరుపున సీనియర్ పాత్రికేయుడు రాయల సునీల్‌కుమార్ మంగళవారం వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. యువకులు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలకూరి నగేష్, నగేష్, లతీఫ్, శంకర్, చక్రవర్తి, మహేష్, భారీ శ్రీను తదితరులున్నారు.

క్రీడాకారుడికి చేయూత



మునుగోడు రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలివెల గ్రామానికి చెందిన క్రీడాకారుడు గుత్తి శివకుమార్ తెలంగాణ రాష్ట్రం నుంచి ఇంటర్నేషనల్ బేస్ బాల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. క్రీడాకారుడి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న వెదిర పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ వెదిరే మెగారెడ్డి రూ.50లు, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి రూ.20వేలు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వట్టికోటి శేఖర్ రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. బేస్‌బాల్ క్రీడకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు.

సర్వే పైసలు ఎప్పుడిస్తారు?

(5వ పేజీ తరువాయి)


కష్టానికి ప్రతిఫలం ఇవ్వడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. సమగ్ర కుటుంబ సర్వేను ప్రభుత్వం చెప్పిన సమయంలోనే జిల్లాలో సకాలంలో పూర్తిచేశామని, అలాంటప్పుడు రెమ్యూనరేషన్‌ను ఎందుకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల తర్వాత సర్వే రెమ్యూనరేషన్ కోసం ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆందోళనను తీవ్రతరం చేసే అవకాశం ఉంది.

వారం తరువాత ప్రత్యక్ష కార్యాచరణ



సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ప్రభుత్వం వెంటనే రెమ్యూనరేషన్‌ను చెల్లించాలి. లేదంటే వారం తరువాత ప్రత్యక్ష కార్యచరణకు దిగుతాం. కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలను చేపడుతాం. రెమ్యూనరేషన్ కోసం గత మార్చి 18న, ఈనెల 5వ తేదీన ఉన్నతాధికారులకు వినతిపత్రాలను అందజేశాం. విషయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వానికి నివేదిక పంపించి త్వరితగతిన రెమ్యూనరేషన్ చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ వారం రోజుల్లో ప్రభుత్వం రెమ్యూనరేషన్ ఇవ్వకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతాం.

- పెరుమాళ్ల వెంకటేశం, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఆనందం



నెరవేరిన మినీ అంగన్‌వాడీల కల

- అంగన్‌వాడీ టీచర్‌గా అప్‌గ్రేడ్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 402 మందికి ప్రయోజనం

భువనగిరి టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): మినీ అంగన్‌వాడీ టీచర్ల దశాబ్దాల కల నెరవేరింది. అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తిస్తూ సమాన వేతనం ఇవ్వాలని చేసిన పోరాటాలు ఫలించాయి. మినీ అంగన్‌వాడీలను అంగన్‌వాడీ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 402 మంది అంగన్‌వాడీ టీచర్లుగా అప్‌గ్రేడ్ అయ్యారు. అలాగే వారి వేతనం రూ.7,800 నుంచి రూ.13,650కి పెరగనుంది. త్వరలో ఆయా కేంద్రాల్లో ఆయాలను నియమించే అవకాశాలు కూడా ఉన్నాయి. దీంతో అర్హులైన స్థానిక మహిళలకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై అప్‌గ్రేడ్ పొందిన అంగన్‌వాడీ టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఖాళీ పోస్టులను కూడా భర్తీ చేస్తామని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి జిల్లాలో అప్‌గ్రేడ్ అయిన మినీ అంగన్‌వాడీ కేంద్రాలతో కలిపి మొత్తం వీటి సంఖ్య 4,203కు చేరింది. వీటిలో 192 టీచర్ల పోస్టులు, 800 ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే 402 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయి అంగన్‌వాడీ కేంద్రాలుగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయడంతో వాటిలో నూతనంగా ఏర్పడే ఆయాల పోస్టులను కూడా భర్తీ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం 20మంది పిల్లలకు పైబడి ఉంటేనే ఆయా పోస్టు మంజూరవుతుంది. దీంతో అప్‌గ్రేడ్ అయిన అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా ఆయా పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తే ప్రస్తుత 800 ఆయా పోస్టుల ఖాళీల సంఖ్య గణనీయంగా పెరగనుంది. అదే సమయంలో అప్‌గ్రేడ్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను తేల్చడం లేదా నిబంధనలను సవరిస్తూ సంఖ్యతో నిమిత్తం లేకుండా ఆయా పోస్టులను మంజూరు చేసి భర్తీ చేసే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

జిల్లా	కేంద్రాలు	అప్‌గ్రేడెడ్ మినీ అంగన్‌వాడీలు	టీచర్ల ఖాళీలు	ఆయాల ఖాళీలు
నల్లగొండ	2,093	262	57	263
సూర్యాపేట	1,209	83	78	274
యాదాద్రి	901	57	57	263
మొత్తం	4,203	402	192	800

ఆగ్రహం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నేతలు (ఫైల్‌ఫొటో)

సర్వే పైసలు ఎప్పుడిస్తాయి?

- జిల్లాలో 9వేల మందికి పైగా ఎదురుచూపు
- దశల వారీగా ఆందోళనకు సిద్ధమవుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు రెమ్యునరేషన్ చెల్లించక పోవడంతో ఆందోళనబాట పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నవంబరు 6 నుంచి 18వ తేదీ వరకు సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించింది. ఈ సర్వేలో ఉద్యోగులతో పాటు ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో సుమారు 9వేల మంది సర్వేలో పాల్గొనగా, నేటికీ రెమ్యునరేషన్ విడుదలచేయలేదు.

\- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయులు రెమ్యునరేషన్ కోసం ఎదురుచూసి ఈ ఏడాది మార్చి 18న నిరసన తెలిపారు. తిరిగి ఈ నెల 5న కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన సర్వేను కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకొని దేశవ్యాప్తంగా కులగణనకు ఆమోదం తెలిపింది. అయితే దేశానికే ఆదర్శంగా నిలిచిన కుటుంబ సర్వేను నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు, సిబ్బందికి ఇప్పటి వరకు రెమ్యునరేషన్ చెల్లించకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. సుమారు ఆరు నెలలు దాటినా చెల్లింపుల విషయంలో ప్రభుత్వం తాత్సరం చేస్తుండటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సర్వే నిర్వహించిన సూర్యాపేట, యాదాద్రి జిల్లాల సిబ్బందికి రెమ్యునరేషన్‌ను చెల్లింపులు పూర్తయ్యాయి. చిన్న జిల్లాల్లో చెల్లింపులను పూర్తి చేసిన ప్రభుత్వం రాష్ట్రంలోనే అధిక మండలాలు ఉన్న నల్లగొండ జిల్లాలో మాత్రం నేటికీ వాటిని చెల్లించలేదు. పెద్ద జిల్లా కావడంతో రెమ్యునరేషన్ అధికంగా ఉండటంతోనే ఆలస్యం చేస్తున్నారన్న చర్చ నడుస్తోంది.

శ్రమకోర్చి విధులు నిర్వహించినా

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులతో పాటు ఉద్యోగులకు సర్వే బాధ్యతలు అప్పగించింది. వారు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. తొలుత ప్రతీ ఇంటికి స్టిక్కరింగ్ చేసి ఆ తరువాత ప్రభుత్వం ఇచ్చిన నిర్దేశిత ఫాంలో వివరాలను నింపారు. సర్వేలో పలు ప్రశ్నలతో కూడి ఉండటంతో ఒక్కో కుటుంబ సర్వేకు గంటన్నరకు పైగా సమయం పట్టిన సందర్భాలు ఉన్నాయి. కొన్నిసార్లు ఆయా కుటుంబ సభ్యులు లేకపోతే తిరిగి ఆ ఇంటికి వెళ్లి మరోసారి వివరాలు నమోదు చేశారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులానికి సంబంధించిన వివరాలను ఎన్యూమరేటర్లు నమోదు చేశారు. సర్వే కోసం శ్రమకోర్చి విధులు నిర్వహించామని, అయినా ప్రభుత్వం చెల్లింపులు చేయకపోవడమేంటని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. ఇతర జిల్లాలలో సర్వే నిర్వహించిన సిబ్బందికి చెల్లింపులు చేసి జిల్లాలో మాత్రం నిలిపివేయడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మహిళా ఉపాధ్యాయినులు ఈ సర్వేలో ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రమకోర్చి సర్వే నిర్వహించినా చెల్లింపులు చేయకపోడంతో ఉపాధ్యాయినులు అసంతృప్తిగా ఉన్నారు. అయితే బిల్లులు చేసి ప్రభుత్వానికి జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. అయినా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో రెమ్యూనరేషన్ ఎప్పుడువస్తుందో,అసలు వస్తుందో రాదోననే సందేహాన్ని ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు.

ఎన్యూమరేటర్‌కు రూ.10వేలు, సూపర్‌వైజర్‌కు రూ.12వేలు...

సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లకు రూ.10వేలు, సూపర్‌వైజర్లకు రూ.12వేల చొప్పున చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించి అందుకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో సుమారు 9వేలకు మందికి పైగా ఈ రెమ్యూనరేషన్‌ను చెల్లించాల్సి ఉంది. సర్వే పూర్తి చేసిన అనంతరం కొద్ది రోజుల్లోనే ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉన్నా, ప్రభుత్వం ఆ వైపుగా చర్యలు తీసుకోలేదు. దీంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇప్పటికే రెండు దఫాలుగా ఆందోళనలు నిర్వహించారు. వారం రోజుల్లో రెమ్యూనరేషన్ చెల్లించకపోతే ప్రత్యేక కార్యాచరణకు దిగుతామని ఇప్పటికే టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ హెచ్చరించింది. వారం రోజుల తరువాత దశల వారీగా ఆందోళన కార్యక్రమాలతో పాటు ప్రత్యక్ష కార్యచరణ కూడా చేపడతామని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. కావాలనే ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ రెమ్యూనరేషన్ ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. చేసిన..

- మిగతా 8వ పేజీలో...

ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



కొప్పోలు ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

గుర్రంపోడు, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం మండలంలోని గుర్రంపోడు, కొప్పోలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడుతూ, యాసంగి సీజన్‌లో జిల్లాలో ఇప్పటివరకు 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచామన్నారు. వర్షం వచ్చినప్పటికీ రైతులు ఎలాంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, వారం రోజుల్లో జిల్లాలో ధాన్యం కొనుగోలును పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మండలంలో లారీల కొరత ఉందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, లారీల సమస్య తలెత్తకుండా ఒకే మిల్లుకు నాలుగైదు పంపించకుండా ఆ పరిధిలో ఉన్న మిల్లులన్నింటికీ లారీలను పంపించాలని నిర్వాహకులకు సూచించారు. కేటాయించిన లారీలు సరిపోకపోతే అదనంగా స్థానికంగా లారీలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి దళారులు ధాన్యాన్ని తీసుకువస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మిల్లరు ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, పౌరసరఫరాలశాఖ డీఎం హరీష్, డీసీవో ఉన్నారు.

ఫాంపాండ్లు నిర్మించుకోవాలని

(ఆంధ్రజ్యోతి, నిడమనూరు): రైతులు ఫాంపాండ్లు నిర్మించుకోవాలని, తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రబెల్లి శివారులోని లోలెవెల్ కెనాల్(ఎల్ఎల్‌సీ)ను ఆమె పరిశీలించారు. గ్రామ శివారులో ఉన్న శనగకుంట చెరువును నింపడంతో పాటు ఎల్ఎల్‌సీ కెనాల్‌తో శాశ్వత లిఫ్టును ఏర్పాటు చేయాలని, ముత్యాలమ్మ కుంట ఆక్రమణలు అడ్డుకోవాలని గ్రామస్థులు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో వారి ప్రతిపాదనల మేరకు కలెక్టర్ ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, రెవెన్యూ, ఐబీ అధికారులతో కలిసి చెరువును, కెనాల్‌ను పరిశీలించారు.

గతంలో యూటీ ద్వారా మోటార్ల సాయంతో శనగకుంట చెరువుకు నీటిని సరఫరా చేశారని, మోటార్లు మరమ్మతులకు గురవడంతో వర్షం నీరే దిక్కైందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. చెరువు పరిధిలో ఆయకట్టు, శాశ్వత లిఫ్టు ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ఐబీ డీఈ శివరాత్రి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. 41 ఎకరాల ఆయకట్టు మాత్రమే ఉందని, లిఫ్టు సాధ్యం కాదని ఆయన వివరించారు. దీంతో ఫాంపాండ్లు నిర్మించుకోవాలని రైతులకు ఆమె సూచించారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బోనగిరి రమేష్‌ను ఆదేశించారు. అనంతరం చెరువు శిఖం భూముల ఆక్రమణలపై స్పందించి సర్వే చేసి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జంగాల కృష్ణయ్యను ఆదేశించారు. ఆమె వెంట ఐబీ ఏఈ ప్రవీణ్‌రాజ్, ఆర్ఐ సందీప్, సర్వేయర్ విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

అకాల వర్షాలతో...
నిమ్మ ధర ఢమాల్

- ఏప్రిల్‌లో కిలో రూ.80, ప్రస్తుతం రూ.30
- పేట జిల్లాలో 3వేల ఎకరాల్లో నిమ్మ సాగు

ఆవేదన



పంట చేతికి వచ్చినప్పుడు గిట్టుబాటు ధర లేక, పెట్టిన పెట్టుబడికి సరైన రాబడి రాక నిమ్మ రైతులు ఆందోళన చెందుతున్నారు. సూర్యాపేట జిల్లాలో 3వేల ఎకరాల్లో రైతులు నిమ్మ సాగు చేశా రు. ఎకరాకు రూ.1.20లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. పంట దిగుబడి బాగుందని, ఈ ఏడాదైనా మంచి ఆదాయం వస్తుందని భా వించిన రైతుల ఆశలపై అకాల వర్షం నీళ్లు చల్లింది. మార్చి నెలలో కిలో నిమ్మకాయల ధర రూ.30 ఉండగా, ఏప్రిల్‌లో రూ.80కి పెరిగింది. అయితే అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా కాయలు నేలరాలాయి. ఇదే అదునుగా దళారులు ధరను రూ.30కి తగ్గించారు. సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో దళారులు ఇచ్చిన ధరకు కాయలను విక్రయించి రైతులు నష్టపోతున్నారు.

\- (ఆంధ్రజ్యోతి, కోదాడ)

• 6లో..

వేసవిలో నేర్చుకుందాం

- సెలవుల్లో విద్యార్థుల నైపుణ్యమే లక్ష్యంగా శిబిరాలు
- క్రీడలు, డ్యాన్స్, డ్రాయింగ్, వాయిద్యం, ధ్యానం, సంగీతంలో శిక్షణ
- పాఠశాల విద్యాశాఖ అధ్వర్యంలో రైజింగ్ యంగ్ ఇండియా కార్యక్రమం
- ఉమ్మడి జిల్లాలో పలు పాఠశాలలు ఎంపిక
- సూర్యాపేట జిల్లాలో 50 పాఠశాలల్లో కార్యక్రమాలు

• 7లో..

ఆహ్లాదం



వేసవి సెలవులు వృథా కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. విద్యార్థుల్లో దాగిన నైపుణ్యాలను వెలికితీసి ఆయా అంశాల్లో మరింత సానపట్టేందుకు వేసవి శిబిరాలను ప్రారంభించింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేసవి శిక్షణా శిబిరాలు కొనసాగుతున్నాయి. అదేవిధంగా పాఠశాల విద్యాశాఖ రైజింగ్ యంగ్ ఇండియా పేరిట శిబిరాలు నిర్వహిస్తోంది. క్రీడలు, డ్యాన్స్, డ్రాయింగ్, వాయిద్యం, ధ్యానంతోపాటు పలు విభాగాల్లో శిక్షణ ఇస్తోంది. అందుకు సూర్యాపేట జిల్లాలో 50 పాఠశాలలను ఎంపికచేసి కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

నామినేటెడ్ పోస్టులు 50శాతం కేటాయించాలి

మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేలా సృజన



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు సృజన

దేవరకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం మహిళలకు కేటాయించాలని, దీంతో దేశాభివృద్ధిలో మహిళ భాగస్వామ్యం సాధ్యపడుతుందని జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేలా సృజన అన్నారు. మంగళవారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన ప్రాంతీయ మహిళా సమా ఖ్య నియోజకవర్గ జనరల్‌బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైందన్నారు. మహిళాశక్తి గురించి, ఆహార నియంత్రణ గురించి మాట్లాడుతూనే వ్యవస్థీకృత హింసకు పాల్పడుతోందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి పెనుభారం మోపుతోందన్నారు. పారిశుధ్య కార్మికులు మొదలు ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, వైద్యులను సైతం కాంట్రాక్ట్ పద్ధతిలో నియమిస్తున్నారని, దీంతో శ్రమశక్తిని దోచుకుంటున్నారని ఆరోపించారు. శాశ్వత ఉద్యోగాల్లో మహిళా భాగస్వామ్యాన్ని తగ్గిస్తున్నారని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకంలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంలేదని ఆరోపించారు. అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారం, ప్రతీ మహిళకు రూ.2,500 ఇస్తామన్న హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెదునూరి జ్యోతి, జిల్లా అధ్యక్షురాలు లింగంపల్లి అనిత, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ, మంజుల, జ్యోతి, సంగీత, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహిళా సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నల్లగొండ ఇంజనీర్స్ క్రికెట్ లీగ్ పోటీలు



క్రికెట్ జట్లతో నల్లగొండ అంజనేయులు తదితరులు

హాలియా, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఏఈఈ అసోసియేషన్, హైదరాబాద్ ఇంజనీరింగ్ అసోసియేషన్ అధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నీటి పారుదల ఇంజనీర్స్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ క్రికెట్ లీగ్ పోటీలను నల్లగొండలో అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ నల్లగొండ అంజనేయులు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు క్రాంతికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉద్యోగుల మానసిక ఉల్లాసం కోసం అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పోటీల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ శివరాత్రి శ్రీను ప్రభాకర్, నాగరాజు, సంతోష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మహేష్, జనరల్ సెక్రటరీ చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండాను మించిన జెండా, ఎజెండా లేదు

సీపీఎం నేత జూలకంటి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి

వేములపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచం లో ఎర్రజెండాను మించిన జెండా, ఎజెండా లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూ లకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మం డలంలోని మొల్కపట్నం గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకుడు మాలి జనార్ధన్‌రెడ్డి, మా జీ జడ్పీటీసీ మాలి పురుషోత్తంరెడ్డి వర్ధంతి సభల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మా ట్లాడారు. మాలి జనార్ధన్‌రెడ్డి ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాడిన వ్యక్తి అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ వృత్తికి రాజీనా మా చేసి ప్రజల కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. మాలి పురుషోత్తంరెడ్డి సైతం ప్రజల పక్షాన, రైతుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడిన మహా నాయకుడన్నారు. ఇరువురు సమసమాజం, పేద ప్రజల స్వేచ్ఛ కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. ప్రస్తుత సమాజంలో ఎర్రజెండాపై చిన్న చూపు చూస్తున్నారని అది వారి అమాయకత్వం అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎర్రజెండా పాలన నడుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజలను మభ్యపెడుతూ పాలన సాగిస్తోందని ఆరోపించారు. దేశంలో సామాన్యుడు జీవనం సాగించే పరిస్థితి లేదని, దేశ సంపదను దోచి కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని, ప్రజలు ఆర్థిక ఊబిలోకి నెట్టివేయబడ్డారన్నారు. రాష్ట్రం, దేశం సుఖసంతోషంగా ఉండాలంటే కమ్యూనిస్టు పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు పాదూరి శశిధర్‌రెడ్డి, రవినాయక్, రెమడాల పరుశురాములు, చౌగాని సీతారాములు, మల్లు గౌతంరెడ్డి, పాదూరి గోవర్ధని, ప్రణీత్‌రెడ్డి, క్రాంతి, సైదులు, ఎల్లయ్య, లింగయ్య, పాల్గొన్నారు.

ఉపాధిహామీ చట్టం పరిరక్షణకు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య

చిట్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ చట్టం పరిరక్షణకు కూలీలు, సిబ్బంది ఐక్యంగా ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య పిలుపునిచ్చారు. మంగళవారం చిట్యాలలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీని పట్టణ ప్రాంతాలకు విస్తరించి, కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడుభూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14రకాల సరుకులు పంపిణీ చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిన చట్టాలను దొడ్డిదారిన అమలు చేస్తేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. రైతుల పొలాల్లో మోటార్లకు మీటర్లు బిగించి చార్జీలు వసూలు చేయడానికి రంగం సిద్ధం చేసిందన్నారు. ఉపాధిహామీ చట్ట పరిరక్షణకు ఈ నెల20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, ఉపాధ్యక్షుడు కత్తుల లింగస్వామి, మండల అధ్యక్షుడు కల్లూరు కుమారస్వామి, గుడిసె లక్ష్మీనారాయణ, కొండేటి రాములు, అర్రూరి నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో అపార నష్టం

• 7లో..

చెత్తగా నిర్వహణ

● మినీ డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న బంగారుగడ్డ
● పట్టించుకోని అధికారులు
● అవస్థలు పడుతున్న స్థానికులు



బంగారుగడ్డ వద్ద చెత్తకుప్పలు, ఆస్పత్రి వ్యర్థాలను కుప్పగా వేసిన వైనం

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)
మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ వ్యర్థాలతో నిండు కుందనో.. మరెందుకో గానీ మునిసిపల్ పారిశుధ్య విభాగం బంగారుగడ్డలో మినీ డంపింగ్ యార్డును ఏర్పాటు చేసింది. దీంతో సీతారాంపురం, బంగారుగడ్డను వేరేచేసే ప్రధాన నాలా బ్రిడ్జివెంట చెత్తకుప్పలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. పండ్లు, కూరగాయల వ్యర్థాలతోపాటు చికెన్ వ్యర్థాలు, తాగేసిన కొబ్బరిబొండాలు పడేస్తున్నప్పటికీ మునిసిపల్ శానిటరీ విభాగం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఇరు కాలనీలను కలిపేందుకు వేసిన బ్రిడ్జీ నుంచి వెళ్లే రహదారంతా చెట్ల కొమ్మలు, గాజుపెంకలతో నిండుకుందని స్థానికులు వాపోతున్నారు. ఇక ఆస్పత్రుల నుంచి వెలువడే ప్రమాదకర వ్యర్థాలు సైతం ఇక్కడే గుట్టలుగా దర్శనమిస్తున్నాయి.

కాలుష్యం, అనారోగ్యం
డంపింగ్ యార్డుకు వెళ్లాల్సిన వ్యర్థాలు తమ పరిసరాల్లో కనిపిస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తకుప్పలు నిల్వ ఉన్న కారణంగా వాతావరణం కలుషితమవుతోందంటున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు, పందుల బెడద పెరిగిందని, సూక్ష్మక్రిముల ఇబ్బంది ఉందంటున్నారు. దుమ్ము, దుర్వాసనతో అనారోగ్య సమస్యలు తలెత్తుతూ జీవనశైలిపై ప్రభావం చూపుతున్నాయంటున్నారు. సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు


కాలనీలో చెత్తకుప్పలు పెరిగి, వ్యర్థాలతో నిండింది. వ్యర్థాల వల్ల దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. కాలనీలో దోమలు, పందుల బెడద పెరిగింది. ఇదే విషయాన్ని మునిసిపల్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాం. అయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు కాలనీలో పర్యటించి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

కంచరకుంట్ల దయాకర్‌రెడ్డి, స్థానికుడు

చర్యలు తీసుకుంటాం


మా శానిటరీ విభాగం సమర్థంగా పనిచేస్తోంది. బంగారుగడ్డలో పర్యటించి అవసరమైన చర్యలు తప్పకుండా తీసుకుంటాం. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయవద్దు. తడి, పొడి చెత్తను విడివిడిగా మా సిబ్బందికి అందజేయాలి. పండ్లు, కూరగాయల వ్యాపారులు చెత్తను పారిశుధ్య సిబ్బందికి అప్పగించాలి.

మహ్మద్ యూసుఫ్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

గ్రామ దేవతలు.. తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు

● సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



బొడ్రాయి వద్ద పూజల్లో పాల్గొన్న జానారెడ్డి, శంకర్‌నాయక్

పెద్దవూర, మే 6(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో కొలువైన గ్రామదేవతలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, గ్రామీణ వ్యవస్థకు ప్రతీకలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని తమ్మడపల్లిలో దేశ గురువు కందుల రామానుజారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బొడ్రాయి తృతీయ వార్షికోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రజల మధ్య ఐక్యతను తీసుకురావడంలో గ్రామ దేవతల ఉత్సవాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. అంతకుముందు గ్రామంలోని మహిళలంతా బోనాలతో వచ్చి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, కర్న బ్రహ్మానందరెడ్డి, మాజీ సర్పంచ్‌లు నులక రమణరెడ్డి, వద్దిరెడ్డి రవీందర్‌రెడ్డి, కర్న దామోదర్‌రెడ్డి, కమతం జగదీశ్వర్‌రెడ్డి, కూన్‌రెడ్డి దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు కార్మికులకు అండగా నిలవాలి

● మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్
● శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం



నాగయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మే 6(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారంలో సంఘాలు అండగా నిలవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో శ్రమశక్తి అవార్డు గ్రహీత నూకపంగ నాగయ్యకు శాలువా కప్పి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సన్మానించారు. మేడే సందర్భంగా హైదరాబాద్‌లో రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో శ్రమశక్తి అవార్డును పొందిన నాగయ్యను సన్మానించుకోవడం కార్మికులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఐఎన్‌టీయూసీ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా, కార్మికులకు యాజమాన్యాలకు మధ్య వారధిగా పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకు నాగయ్యకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో కార్మిక యూనియన్‌ను మరింతగా బలోపేతం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు సామా వెంకన్న, ఎన్ఎస్పీ యూనియన్ నాయకులు పరిక వెంకటేశ్వర్లు, రాముల, ఆంజనేయులు, విక్రమ్, పాండు నాయక్, షేక్ అఫ్జల్, బొంగరాల శ్రీనివాస్, కృష్ణారెడ్డి, కందుల శ్రీనివాస్, గుండ్రెడ్డి బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ
సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి లబ్ధిదారునికి అందజేశారు. మిర్యాలగూడ మండల పరిధిలోని సుబ్బారెడ్డి గూడెం గ్రామానికి చెందిన చక్రాల అశోక్‌కు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.27వేల చెక్కును క్యాంపు కార్యాయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు, ఆర్థికంగా తోడ్పాటునందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఉపయోగపడుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు గుండ్రెడ్డి బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షుడు తిప్పన రవిందర్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దు వరకూ ఉద్యమం

● ఏఐటీయూసీ, సీఐటీయూ రాష్ట్రనేత పల్లా దేవేందర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్



అభివాదం చేస్తున్న దేవేందర్‌రెడ్డి, మల్లేష్, నాయకులు

మిర్యాలగూడ, మే 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కుల చట్టాలకు వ్యతిరేకంగా తెచ్చిన లేబర్‌కోడ్‌లను రద్దు చేసేంతవరకూ ఉద్యమం నిర్వహిస్తామని ఏఐటీయూసీ, సీఐటీయూ రాష్ట్రనేతలు పల్లా దేవేందర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్ అన్నారు. 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ భవన్‌లో నిర్వహించిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నూతనంగా నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. కార్మికులు కనీసం సంఘాలు పెట్టుకునే పరిస్థితి లేకుండా ఈ లేబర్ కోడ్‌లు చేస్తున్నాయన్నారు. కార్మికుల శ్రమను దోపిడీచేసే కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను తెచ్చారన్నారు. ఐక్య ఉద్యమాల ద్వారానే కార్మికుల హక్కులను కాపాడుకోవాలన్నారు. కనీసం, వేతనం, పని గంటల తగ్గింపు కోసం పెద్దఎత్తున ఉద్యమించాలన్నారు. 20న జరిగే సార్వత్రిక సమ్మెకు సంఘటిత, అసంఘటిత రంగాల్లోని కార్మికులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి ఉత్పత్తి, రవాణారంగాన్ని స్తంభింపజేసి ప్రభుత్వానికి తీవ్ర నిరసన తెలియజేయాలన్నారు. సమ్మెలో భాగంగా స్థానిక సుందరయ్య పార్క్‌నుంచి రాజీవ్‌చౌక్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లానేతలు తిరుపతి రామ్మూర్తి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లుగౌతంరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు బంటు వెంకటేశ్వర్లు, ఎండీ సయీద్, టీఆర్ఎస్‌కేవీ జిల్లానేత అంజయ్య, టీఎన్‌టీయూసీ నేతలు అంజిబాబు, కేశవులు, పాపిరెడ్డి, రాంచంద్రు, లింగానాయక్, వాడపల్లి రమేష్, విజయలక్ష్మి, శ్రీనివాస్, నిరంజన్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.



ఓంకార్ శతజయంతి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఓంకార్ శతజయంతిని విజయవంతం చేయాలి

● ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టయ్య

మిర్యాలగూడ, మే 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మద్దికాయల ఓంకార్ శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. మంగళవారం స్థానిక రాజీవ్‌చౌక్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలం ఏపూరులో జన్మించిన ఓంకార్ తన 15వ ఏటనే ఆంధ్రమహాసభ పిలుపునందుకుని తెలంగాణ ఉద్యమంలో చేరి దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్ల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, నిజాం రజాకర్ల దాష్టికానికి వ్యతిరేకంగా వీరోచిత పోరాటం కొనసాగించారని అన్నారు. ఓంకార్ శత జయంతి ఉత్సవాలు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12న వరంగల్ జిల్లా వాచాపూర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12వ తేదీన ఓంకార్ స్వగ్రామం నుంచి జ్యోతి ని వెలిగించి నర్సంపేట మీదుగా సభాస్థలికి తీసుకవస్తారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వస్కుల సైదమ్మ, సహాయకార్యదర్శి పోతుగంటి కాశి, ధీరావత్ మోహన్ నాయక్, జ్యోతి కిరణ్, ఇమ్మానియేల్, రవి, వీరన్న, సందీప్, శారద, సాలమ్మ, శ్రీను నాయక్, మచ్చ సైదులు, దోరేపల్లి కాశయ్య, రమేష్, జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.



తీదేడులో ర్యాలీలో పాల్గొన్న హెచ్ఎం సురేందర్, టీచర్లు, విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

● తీదేడు ప్రధానోపాధ్యాయుడు సురేందర్

చింతపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తీదేడు ప్రధానోపాధ్యాయుడు సురేందర్ కోరారు. మండలంలోని తీదేడు(వెంకటంపేట) జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం గడ్డం సురేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో పాటు ఉచితంగా దుస్తులు నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. ఉత్తమ ఫలితాల సాధన కోసం ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. 15 మంది విద్యార్థులను నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం సీహెచ్. పద్మ, వై.శ్రీరాములు, జి.దేవకుమార్, శ్రీరాములు, పాల్వాయి వాసుదేవ్‌రెడ్డి, విష్ణుకాంత, ఎల్. రామ్ రెడ్డి, పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్

దేవరకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం దేవరకొండలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి సాహూ మహరాజ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. వెనుకబడిన కులాల రిజర్వేషన్ల కోసం సాహూ మహరాజ్ కృషి చేశారన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు వరికుప్పల శ్రీను, భాషనాయక్, కడారి బలరాం, లక్ష్మణ్‌నాయక్, మహేందర్, నర్సింహ, శారద, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

● ఏవో శ్రావణి కుమారి

చింతపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): రైతులందరూ తమ ధ్రువపత్రాలను ఆన్‌లైలో నమోదు చేసి, గుర్తింపు కార్డులు పొందాలని ఏవో శ్రావణికుమారి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల సద్వినియోగానికి ఈ గుర్తింపు కార్డు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో మౌనిక, రైతులు శివర్ల రమేష్ యాదవ్, బొడ్డు మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి నెల రోజుల జైలు

నిడమనూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శి విధులను ఆటంకపర్చిన కేసులో నిందితుడికి నెల రోజుల జైలుశిక్ష విధిస్తూ నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి స్వప్న తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరిసాగర్ మండలం తునికినూతల గ్రామంలో 2018 అక్టోబర్ 15న పంచాయతీ కార్యదర్శి ఉబ్బపల్లి శ్రావణ్‌కుమార్ గ్రామానికి చెందిన స్వచ్ఛభారత్ మరుగుదొడ్డి లబ్ధిదారుల పేర్లు చదువుతుండగా గ్రామానికి చెందిన రమావత్ దేవునాయక్ అక్కడికి వచ్చి కార్యదర్శి చేతిలో ఉన్న జాబితాను తీసుకోవడమే కాకుండా ద్విచక్రవాహన తాళం చెవులను కూడా తీసుకొని దుర్భాషలాడుతూ విధులను ఆటంకపర్చాడు. కార్యదర్శి శ్రావణ్‌కుమార్ అదేరోజు తిరుమలగిరిసాగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ కుర్మయ్య నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. మంగళవారం కేసు విచారించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో నిందితుడికి నెల రోజుల జైలుశిక్ష లేదా రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సాధన వాదనలు వినిపించారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

● సీఎస్‌కు బీసీ నేతల వినతి



సీఎస్ రామకృష్ణారావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మిర్యాలగూడ, మే 6(ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. ప్రభుత్వ కార్యదర్శి రామకృష్ణారావును కలిసి బీసీ సంఘం ఆధ్వర్యంలో సన్మానించి, అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలోని కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహత్మాగాంధీ, శాతవాహన యూనివర్సిటీలలో కళాశాలల యాజమాన్యాలు పరీక్షలను బహిష్కరించాయని, సకాలంలో పరీక్షలు నిర్వహించకపోతే విద్యార్థులకు ఇక్కట్లు ఎదురవుతాయన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువజన విద్యార్థి పరిషత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి



టీడీపీ డిజిటల్ సభ్యత్వ కార్డులు అందజేస్తున్న అరుణ్‌కుమార్

● పార్టీ సాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పా అరుణ్‌కుమార్


నిడమనూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పా అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నిడమనూరు, శాఖాపురం, బొక్కమంతలపహాడ్, తుమ్మడం బంకాపురం, రాజన్నగూడెం తదితర గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించడంతో పాటు పార్టీ క్రియాశీలక సభ్యులకు డిజిటల్ సభ్యత్వ కార్డులు అందజేసి మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని ఆరోపించారు. టీడీపీ హయాంలోనే నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఇతర పార్టీలకు చెందిన వారు టీడీపీలో చేరి పార్టీ పటిష్ఠతకు దోహదం చేయాలని కోరారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా గ్రామ కమిటీలు నియమించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంద తిరుపతయ్య, ఉడుతూరి నర్సింహారెడ్డి, కంచర్ల వెంకన్న, ఉన్నం నారాయణ, ముద్దా వెంకన్న, ఉపేందర్, అనిల్, కోటయ్య, సత్తిబాబు, శ్రీనివాస్, నల్లమోతు చంద్రం, సీతారాములు, సత్యనారాయణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలి : వెంకటేశ్వర్లు
మిర్యాలగూడ టౌన్: పార్టీ అభివృద్ధికి సమష్టిగా పని చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జాతీయ క్రమశిక్షణ సంఘ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మండవ వెంకటేశ్వర్ల సమక్షంలో పట్టణంలో వార్డు కమిటీలు వేస్తున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్, మైనార్టీ నాయకులు నసీరుద్దీన్‌బాబా, చిలకల వెంకన్న, గర్దాసు ప్రభాకర్, కస్తూరి సత్యనారాయణ, బైరి రమేష్, సాయిభరత్, మున్నీసాబేగం, కాంతాచారి, శంకర్ పాల్గొన్నారు.

సర్వే పైసలు ఎప్పుడిస్తారు?

(5వపేజీ తరువాయి)

కష్టానికి ప్రతిఫలం ఇవ్వడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. సమగ్ర కుటుంబ సర్వేను ప్రభుత్వం చెప్పిన సమయంలోనే జిల్లాలో సకాలంలో పూర్తి చేశామని, అలాంటప్పుడు రెమ్యూనరేషన్‌ను ఎందుకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి వారం రోజుల తరువాత సమగ్ర కుటుంబ సర్వే రెమ్యూనరేషన్ కోసం ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆందోళనను తీవ్రతరం చేసే అవకాశం ఉంది.

వారం తరువాత ప్రత్యక్ష కార్యాచరణ


సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ప్రభుత్వం వెంటనే రెమ్యూనరేషన్‌ను చెల్లించాలి. లేదంటే వారం తరువాత ప్రత్యక్ష కార్యచరణకు దిగుతాం. కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలను చేపడుతాం. రెమ్యూనరేషన్ కోసం గత మార్చి 18న, ఈనెల 5వ తేదీన ఉన్నతాధికారులకు వినతిపత్రాలను అందజేశాం. విషయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వానికి నివేదిక పంపించి త్వరితగతిన రెమ్యూనరేషన్ చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ వారం రోజుల్లో ప్రభుత్వం రెమ్యూనరేషన్ ఇవ్వకపోతే ప్రత్యక్ష కార్యచరణకు దిగుతాం. ఎంతో మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు సర్వేను విజయవంతం చేశారు. సర్వే పూర్తి చేసి ఆరు నెలలు దాటినా రెమ్యూనరేషన్ రాకపోవడం విచారకరం.

- పెరుమాళ్ల వెంకటేశం, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి